

ప్రాథమిక పాఠశాలలకు మంగళం?

జిల్లాలో 30కిపైగా స్కూళ్ల మూసివేత

- పది మంది కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలలకు ముప్పు
- ఈ ప్రక్రియతో 40 మంది ఎస్జీటీలు, 100 మందికి పైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మిగులు
- 29 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 17 స్కూళ్ల భవితవ్యంపై నీలి నీడలు
- కసరత్తు ప్రారంభించిన జిల్లా విద్యాశాఖ



నలుగురు విద్యార్థులతో కొనసాగుతున్న పెదగంట్యాడ మండలం మరుబాయి ప్రాథమిక పాఠశాల (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మనుగడకు పెనుముప్పు పొంచి ఉంది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117 రద్దుచేశారని సంతోషిస్తుండగా ఆ ముసుగులో ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారేలా ఉన్నతాధికారులు మెమో జారీ చేశారనే వాదన వినిపిస్తోంది.

ఈ మెమో మేరకు జిల్లాలో 25 నుంచి 30 ప్రాథమిక పాఠశాలలు పూర్తిస్థాయిలో మూత పడతాయని సమాచారం. పదిమంది, అంతకంటే తక్కువగా విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలో తొలుత 3,4,5 తరగతులను తొలగించి, అదే పంచాయతీలో ఏర్పాటుచేయనున్న మోడల్ ప్రాథమిక పాఠశాలకు తరలిస్తారు. అప్పటికీ ఒకటి, రెండు తరగతుల పిల్లలు ఐదుగురు కంటే తక్కువ ఉంటే వారిని కూడా అదే పంచాయతీలో మోడల్ లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలలకు తరలించి, అక్కడ ఉన్న ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తారు.

జిల్లాలో పరిస్థితి...

జిల్లాలో పదిమంది కంటే తక్కువ విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలు 53 ఉన్నాయి. మొత్తంగా పదిమంది కంటే తక్కువగా ఉన్న పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమేనని అంటున్నారు. ఐదుగురు కంటే తక్కువ ఉన్న ప్రాథమిక పాఠశాలలు 25 వరకు ఉన్నాయి. వీటిని తొలుత మూసివేసి, అక్కడి చిన్నారులను సమీప గ్రామంలోని పాఠశాలకు పంపుతారు. ఆరు నుంచి పదిమంది పిల్లలున్న చోట 3,4,5 తరగులను మోడల్ ప్రాథమిక పాఠశాలకు తరలించగా, ఐదుగురు కంటే ఎక్కువగా పిల్లలుంటే ఆ పాఠశాల కొనసాగుతుంది. లేదంటే దానిని మూసివేసి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని అక్కడకు తరలిస్తారు. ఈ లెక్కన దబ్బంద ఎస్సీ కాలనీ, దిబ్బమీద పాలెం, మరడ దాసరిపేట, మురుబాయి ఇలా పలు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు మూతపడనున్నాయి. కాగా ప్రతి పంచాయతీలో 60 మంది విద్యార్థులున్న పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా తీర్చిదిద్దుతారు. ఇందులో ప్రతి తరగతికి ఒక టీచర్‌ను కేటాయిస్తారు. పంచాయతీలో మరో గ్రామంలో ఉదాహరణకు 40 మంది విద్యార్థులుంటే దానిని బేసిక్ పాఠశాలగా పరిగణించి, కేవలం ఇద్దరు టీచర్లను మాత్రమే కేటాయిస్తారు. పాఠశాలల ... మిగతా 6వ పేజీలో

మోగనున్న నగారా



ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

- నేటి నుంచి పదో తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 11న పరిశీలన, 13న ఉపసంహరణ, 27న పోలింగ్
- కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్కు ఏర్పాటు

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగనుంది. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ విడుదలచేస్తారు. అదే రోజు ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. ఈనెల పదోతేదీ వరకు ప్రభుత్వ సెలవు దినాలు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడుగంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 11న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ప్రక్రియ ఉంటుంది. 27వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 123 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహిస్తారు. 21,555 మంది ఓటు హక్కు వినియోగించుకుంటారు.

రాష్ట్రంలో ఓటరుగా ఉంటేనే ...

ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్రంలోని ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదై ఉండాలి. అభ్యర్థి జనరల్ అయితే రూ.10 వేలు/ ఎస్సీఎస్టీలైతే రూ.ఐదువేలు డిపాజిట్‌గా చెల్లించాలి. నామినేషన్ ఫారం, ఆస్తులు, అప్పులు, కుటుంబానికి చెందిన సమాచారంతో అఫిడవిట్, ఓటరు వివరాలను సంబంధిత అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి సంతకంతో కూడిన సర్టిఫికెట్‌ను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. నామినేషన్‌పై ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఉన్న పదిమంది ఓటర్లు బలపరుస్తూ సంతకాలు చేయాలి. నామినేషన్ల స్వీకరణ సమయంలో అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి వద్దకు అనుమతిస్తారు. సందేహాలు నివృత్తి, ఇతరత్రా సహాయం కోసం కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ,అందుబాటులో ఉంటారు.

ఓటు కోసం మరో 1,300 దరఖాస్తులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరో 1,300 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గతనెల 31వ తేదీ చివర రోజు కావడంతో అప్పటివరకు వచ్చిన ఈ దరఖాస్తులను విచారించేందుకు వీలుగా సంబంధిత జిల్లాలకు పంపారు. కాగా ఈనెల పదో తేదీన ఓటరు తుది జాబితా విడుదల చేస్తారు. ప్రస్తుతం జాబితాలో ఉన్న 21,555 మంది ఓటర్లకు వీరు అదనం.

ప్రమాదాల నియంత్రణపై సీపీ ఫోకస్



యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసిన కమిషనర్

- నగరంలో 68 బ్లాక్‌స్పాట్‌ల గుర్తింపు
- ఆయా చోట్ల సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ
- జీవీఎంసీ సహకారంతో జంక్షన్‌ల అభివృద్ధికి చర్యలు
- ఏఐ టెక్నాలజీతో ట్రాఫిక్ సిగ్నల్స్ అనుసంధానం
- నిరంతరాయంగా నో హెల్మెట్, డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద హెల్మెట్ లేకుండా, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి కార్యాచరణ రూపొందించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో అనుసంధానం చేయడంతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తిస్తున్నారు. ఆయా చోట్ల నిరంతరం సిబ్బంది పర్యవేక్షణలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. వరుసగా రెండు నెలలపాటు బ్లాక్‌స్పాట్‌ల వద్ద ఈ చర్యలతో నగరంలో ప్రమాదాలకు అడ్డుకట్టవేయాలని యోచిస్తున్నారు.

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏటా సగటున 1200 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రమాదాల్లో సగటున 300 మంది ప్రాణాలు కోల్పోతుండగా మరో 1,500 మంది క్షతగాత్రులవుతున్నారు. నగరం శరవేగంగా విస్తరిస్తుండడంతో వాహనాల సంఖ్య భారీగా పెరుగుతోంది. దానికి అనుగుణంగా రోడ్ల విస్తరణ జరగడం లేదు. దీనివల్ల వాహనాల రద్దీ పెరిగి, ఎక్కడికక్కడ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. కొమ్మాది, మధురవాడ, కార్‌షెడ్ జంక్షన్, హనుమంతవాక వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్‌పడితే కిలోమీటర్ల పొడవున వాహనాలు బారులు తీరిపోతున్నాయి. గాజువాక, కాన్వెంట్ జంక్షన్ తదితర ప్రాంతాల మీదుగా పోర్టుకు భారీ వాహనాలు వస్తున్నాయి. దీంతో త్వరగా గమ్యం చేరుకోవాలనే ఆత్రుతలో ద్విచక్ర వాహన చోదకులు ట్రాఫిక్ సిగ్నల్స్ జంపింగ్, ఇతర మార్గాల నుంచి వచ్చే భారీవాహనాల రాకను గుర్తించలేకపోవడం, రోడ్లపై ట్యాంకర్ల నుంచి ఆయిల్‌లీకవడం వంటి కారణాలతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాల నియంత్రణకు పోలీసులు ఎన్నిచర్యలు తీసుకుంటున్నా ఆశించినస్థాయిలో ఫలితం కనిపించడం లేదు. పైగా ప్రమాదాల్లో ఏటా వందలాది మంది మృత్యువాత పడుతుండడంతో వారిపైన ఆధారపడే కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఇది ఆర్థిక, సామాజిక సమస్యలకు దారితీస్తోంది.

మూడేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు
2022	1353	346
2023	1180	209
2024	1094	261

సీపీ ప్రత్యేక దృష్టి

ఈ నేపథ్యంలో ప్రమాదాల అడ్డుకట్టకు సీపీ శంఖబ్రతబాగ్చి ... మిగతా 6వ పేజీలో

ఐవోఈ హోదా దక్కేనా ?

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ గుర్తింపునకు ఏయూ అధికారుల యత్నాలు



- 22న వర్క్‌షాప్ నిర్వహణకు ఏర్పాట్లు
- హోదా దక్కితే వర్సిటీకి భారీగా నిధులు
- స్వయం ప్రతిపత్తి లభించే అవకాశం
- దేశంలోని ప్రముఖ వర్సిటీల సరసన చేరే వీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):

కేంద్ర ఉన్నత విద్యాశాఖ అందించే ప్రతిష్ఠాత్మకమైన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమి నెన్స్ (ఐవోఈ) హోదా దక్కించుకునేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. దేశంలోని అనేక విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు ఇందుకోసం తీవ్రస్థాయిలో శ్రమిస్తుంటాయి. దీనిని దక్కించుకోవడం ద్వారా అంతర్జాతీయస్థాయిలో వర్సిటీకి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చేందుకు వీలుంటుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ కూడా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు జాతీయస్థాయిలో సత్తా చాటేలా ప్రణాళికలు రూపొందించాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏయూ అధికారులు ఐవోఈ హోదా కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

ఐవోఈ హోదా దక్కించుకునే ప్రణాళికల్లో భాగంగా ఈనెల 22న ఏయూలో వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దీనికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన సీనియర్ ప్రొఫెసర్ హాజరుకానున్నారు. వర్క్‌షాప్‌లో ఐవోఈ హోదా దక్కించుకునేందుకు ఫ్యాకల్టీ, పరిశోధకులు చేయాల్సిన పనులు, పరిపాలనా పరంగా తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించనున్నారు. అధ్యాపకులు, సీనియర్ ప్రొఫెసర్లు, డీన్లు, పరిశోధక విద్యార్థులు ఇందులో పాల్గొనేలా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

హోదాతో భారీగా లబ్ధి

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదా లభిస్తే ఏయూకు భారీగా లబ్ధి చేకూరుతుంది. యూజీసీతోపాటు కేంద్ర ఉన్నత విద్యాశాఖ నుంచి ఏటా వందల కోట్ల నిధులు వస్తాయి. పరిశోధన ప్రాజెక్టులు భారీ సంఖ్యలో మంజూరవుతాయి. అదే సమయంలో వర్సిటీకి స్వయం ప్రతిపత్తి లభిస్తుంది. కోర్సులు అమలువంటి అంశాల్లో కీలక నిర్ణయాలు తీసుకునే వెసులుబాటుంటుంది. ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు భారీ వేతనాలతో ఉద్యోగాలు అందించేందుకు ప్రముఖ సంస్థలు ముందుకు వస్తాయి. దీనివల్ల క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ పెరుగుతాయి. ప్రపంచ స్థాయి వర్సిటీలతో కలిసి పనిచేసే వెసులుబాటు లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వమే ఈ హోదా కలిగిన ఇనిస్టిట్యూట్స్ గురించి ప్రత్యేకంగా ప్రచారం చేస్తుంది. దీని వల్ల భారీగా లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

ఇవి ఉంటేనే...

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదా దక్కడం కష్టమేమీ కాదని వర్సిటీ వర్గాలు భావిస్తున్నాయి. కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటే చాలంటున్నారు. హోదా రావాలంటే వర్సిటీకి సుదీర్ఘమైన చరిత్ర ఉండాలి. వందేళ్ల చరిత్ర ఉండడం ఏయూకు సానుకూల అంశం. రీసెర్చ్ ప్రాజెక్టులు భారీగా ఉండాలి. వర్సిటీలో పనిచేసే ప్రతి ముగ్గురు అధ్యాపకుల్లో ఒకరు భారీ ప్రాజెక్టుల్లో భాగస్వామిగా ఉండాలి. కన్సల్టెన్సీ రీసెర్చ్ ప్రాజెక్టులు ఉండాలి. టీచింగ్, లెర్నింగ్ మెథడ్స్ ఫాలో కావాలి. కోర్సు ఫైల్ అనుసరించాలి. సింగిల్ ఆథర్ రీసెర్చ్ పేపర్స్ సైన్స్ సైటేషన్ ఇండెక్స్ జర్నల్స్‌లో క్యూ1, క్యూ2 స్టాండర్డ్స్‌తో పబ్లిష్ అయి ఉండాలి. పీహెచ్‌డీల్లో అధిక ప్రవేశాలతోపాటు అదేస్థాయి లో ఔట్‌కమ్ ఉండాలి. మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ వర్క్ జరుగుతుండాలి. వీటిలో కొన్ని అంశాల్లో వర్సిటీ వెనుకబడి ఉంది. వీటిలో మెరుగైన పనితీరు కనబరచడం ద్వారా హోదా దక్కించుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



ముగిసిన అరకు చలి ఉత్సవ్

థింసా నృత్య ప్రదర్శన చేస్తున్న గిరిజన కళాకారులు


అరకులోయలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న చలి ఉత్సవ్ ఆదివారంతో ముగిసింది. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు హాజరయ్యారు. సుంకరమెట్ట కాఫీ తోటల నుంచి మూడు కిలోమీటర్ల మేర సాగిన ట్రెక్కింగ్‌లో జిల్లా న్యాయమూర్తి ఎం.గిరిధర్, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, సబ్ డీఎఫ్‌వో ఉమామహేశ్వరి, స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం క్యూరేటర్ పి.శంకరరావు పాల్గొన్నారు. ఉత్సవ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సచివాలయాల హేతుబద్ధీకరణ

- జనాభా ప్రాతిపదికన ఒక్కో చోట ఆరు నుంచి ఎనిమిది మంది సిబ్బంది
- జిల్లాలో 607 సచివాలయాలు
- మంజూరైన పోస్టులు 5,623
- ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది :5,170.. ఖాళీలు: 453

విశాఖపట్నం/ ఆనందపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):

జనాభా ప్రాతిపదికగా గ్రామ, వార్డు సచివాలయాలను హేతుబద్ధీకరించనున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటైన ఈ వ్యవస్థను గాడిన పెట్టడంతోపాటు పని భారం, జనాభా సంఖ్యను పరిగణనలో తీసుకుని సిబ్బందిని సర్దుబాటు చేస్తారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వుల్లో భాగంగా జిల్లాలో జనాభా సంఖ్య మేరకు సచివాలయాలకు సిబ్బందిని కేటాయిస్తారు. మిగులు సిబ్బందిని సంబంధిత శాఖలకు పంపిస్తారు. జిల్లాలోని నాలుగు గ్రామీణ



మండలాల్లో 56, జీవీఎంసీ పరిధిలో 551 వెరసి 607 గ్రామ/వార్డు సచివాలయాలు ఉండగా మొత్తం 5,623 పోస్టులు ... మిగతా 6వ పేజీలో

75 శాతం హాజరు ఉండాల్సిందే

తక్కువైతే ఇంటర్ పరీక్షలకు నో!

మద్దిలపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు 75 శాతం హాజరు విధిగా ఉండాల్సిందేనని బోర్డు నిర్దేశించింది. అంతకంటే తక్కువ ఉంటే ఫైన్ చెల్లించాలి. అది కూడా 60 శాతం హాజరు వరకు మాత్రమే అవకాశం కల్పించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 75 శాతానికి పది రోజులు తక్కువైతే రూ.వెయ్యి, 15 రోజులు తక్కువైతే రూ.1,500, 15 రోజులకు మించి 60 శాతం వరకు రూ2 వేలు అపరాధ రుసుము చెల్లిస్తేనే హాల్‌టికెట్లు పంపిణీ చేస్తారు. మార్చి 1 నుంచి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు పొందుపరిచేలో గా హాజరు తక్కువున్న విద్యార్థులు ఫైన్ చెల్లించాలని అధికారులు పేర్కొన్నారు.

విమ్స్‌కు అధునాతన వైద్య పరికరాలు

పేదలకు ఉచితంగా ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, ఈఆర్‌సీపీ, ఎండోస్కోపిక్ ఆల్ట్రా సోనోగ్రఫీ పరీక్షలు

- ఉదరకోశ సంబంధిత వ్యాధుల నిర్ధారణలో కీలకం
- మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగపడతాయన్న వైద్యులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో అధునాతన వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, ఎండోస్కోపిక్ రిట్రోగ్రేడ్ కొలాంజియో పాంక్రియాటోగ్రఫీ (ఈఆర్‌సీపీ), ఎండోస్కోపిక్ ఆల్ట్రా సోనోగ్రఫీ (ఈయూఎస్), సిగ్మాయిడో స్కోపీ, సైడ్ వ్యూ ఎండోస్కోపీ, ఈవీఎల్ బాండింగ్ వంటి పరీక్షల నిర్వహణకు అవసరమైన పరికరాలు మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి సమకూరాయి. వీటితో రోగులకు నాణ్యమైన సేవలను అందించగలుగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఆయా పరీక్షలు ఒక్కొక్కటి బయట చేయించుకోవాలంటే కనీసం రెండు నుంచి ఐదు వేల రూపాయల వరకూ ఖర్చవుతుంది. విమ్స్‌లో ఉచితంగా చేస్తున్నారు. నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో విమ్స్‌కు ప్రభుత్వం సుమారు రూ.2 కోట్లతో ఈ పరికరాలను అందజేసింది.



విమ్స్‌కు చేరిన ఆధునిక వైద్య పరికరాలను పరిశీలిస్తున్న వైద్యులు

ఈ సమస్యలతో బాధపడే వారికి..

ఉదరకోశ సంబంధిత సమస్యలతో బాధపడే వారికి ఈ పరికరాల సహాయంతో పరీక్షలు నిర్వహించి మెరుగైన సేవలు ... మిగతా 6వ పేజీలో



సింహాద్రినాథుడికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు సిరి సంపెంగలతో అర్చనలు చేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారికి నిత్యం కల్యాణం జరిపారు మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం జారీ చేసిన అనేక జీఓల వల్ల విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, కూటమి ప్రభుత్వం తక్షణమే వాటిని రద్దు చేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

భగవద్గీత శ్లోకాల పోటీల విజేతలకు బహుమతులు

మధురవాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ మధురవాడ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీల్లో విజేతలకు ఆదివారం ఆదిత్యనగర్‌లో బహుమతులు ప్రదానం చేశారు.మధురవాడ పౌర సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ఎల్ ఎస్ నాయుడు తన సొంత సొమ్ముతో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మధురవాడ వీహెచ్‌పీ శాఖ అధ్యక్షుడు నండూరి రామకృష్ణ, పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, ఎస్‌వీ రమణ, పి. శ్రీరామ్మూర్తి , పి. నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

6న చలో బీసీ... చలో ఢిల్లీ

కొమ్మాది, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర బీసీ సంఘం నాయకుడు దుర్గా నరేశ్ పిలుపుమేరకు ఈనెల 6న ఢిల్లీలో జరిగే చలో బీసీ, చలో ఢిల్లీ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి బీసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ సంఘం నాయకుడు చెన్నూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

కొమ్మాది, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది అష్టలక్ష్మీ దేవాలయంలో వసంత పంచమి సందర్భంగా సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. వేకువజామున సరస్వతీ హోమం జరిపి ఉదయం 9 గంటలకు చిన్నారులతో సరస్వతీ పూజ చేయిస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు ఆలయంలో సంప్రతించాలన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పద్మనాభం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఇందూ జ్ఞాన వేదిక ప్రబోధానంద సేవాసమితి ఆధ్వర్యంలో వేమన జయంతి పురస్కరించుకొని ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలాస్కాన్‌పాలెం, తునిపాలెం గ్రామాల్లో నిర్వహించిన ప్రచార సభల్లో ఇందూ జ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు స్వామి ప్రబోధానంద మాట్లాడుతూ వేమన భగవాన్ రాసిన పద్యాలు నేటితరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక సాధనలో ఉన్నప్పుడే ఉత్తమ జీవన మార్గం సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో విజయరాంపురం ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు త్రినాథరావు, సురేశ్, శ్రీనివాసరావు, లక్ష్మి, అంకమ్మ, బంగారునాయుడు, రాజు పాల్గొన్నారు.

సూర్య భగవానుడికి పూజలు



సింహాచలం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఉన్న సూర్యనారాయణస్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మాఘ మాసం తొలి ఆదివారం కావడంతో దేవస్థానానికి చెందిన నృసింహ వనంలోని సూర్యదేవుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. కొందరు సూర్య నమస్కారాలు చేయగా మరికొందరు ఆలయ సమీపంలో పాయసం వండి స్వామివారికి నివేదించారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్నా, అధికారులు ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.



సినీ గీతానికి డ్యాన్స్ చేస్తున్న పూర్వ విద్యార్థులు



పూర్వ విద్యార్థి బొంతలకోటి రామకృష్ణను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలు

» ఆట పాటలతో సందడి చేసిన పూర్వ విద్యార్థులు

» పలువురికి సన్మానం



యాంకర్‌తో కలిసి బోర అప్పలరెడ్డి నృత్యం

భీమునిపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం సెయింట్ ఆన్స్ గ్రౌండ్‌లో ఉత్సవ కమిటీ నిర్వహించిన పూర్వ విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉన్నత పాఠశాలలో ఆట పాటలతో సందడి చేశారు. పూర్వ విద్యార్థి కోల్ ఇండియా కంపెనీ రిటైర్డ్ జనరల్ మేనేజరు బోర అప్పలరెడ్డి ప్రేమాభిషేకం సినిమాలోని పాటకు స్టెప్పులు వేయగా, ఆయనతో యాంకర్ వాణిశ్రీ కలిసి డ్యాన్స్ చేశారు. అలాగే ఉప్పాడ వెంకట చంద్రశేఖర్ (వాసు) అతని స్నేహితులు నృత్యానికి స్టేజ్ అదిరింది. పూర్వ విద్యార్థి, జాతీయ ఫుట్ బాల్ క్రీడాకారుడు అత్తిలి సత్యనారాయణశ్రీకృష్ణ కూచిపూడి నృత్య నిలయం బృందం ప్రదర్శించిన నాట్య ప్రదర్శనలు అలరించాయి. పూర్వ విద్యార్థుల్లో రిటైర్డ్ డీఈవోలు, ఏయూ డిపార్టుమెంట్ హెచ్‌వోడీలు, రిటైర్డ్ ఎండీవోలు, ఇంజనీర్లు, విశ్రాంత ఉపాధ్యాయులు, వ్యాపారులు ఉన్నారు. అనంతరం నిర్వాహకులు పాఠశాల పూర్వ ఉపాధ్యాయిని నాగమణి, రిటైర్డ్ మునిసిపాలిటీ బిల్లు కలెక్టర్ జీఎస్ ప్రకాశరావు, బిల్డర్ బొంతలకోటి రామకృష్ణ, పైలాన్ నిర్మాణ దాత కట్టమూరి పాపయ్యశెట్టి, డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మీసాల ఉపేంద్ర, పాఠశాల యూడీసీ కాళ్ల నరసింగరావు, విశ్రాంత ఉపాధ్యాయులు గణపతి, వడ్డే వెంకట కేశవరావు, మదాబత్తుల కాళిదాసు తదితరులను ఘనంగా సత్కరించారు. గాడు అప్పలనాయుడు, మైలపల్లి లక్ష్మణరావు, పూసర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

ఆత్మ విశ్వాసంతోనే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎంపీ రాజు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఒత్తిడి, భయానికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునని ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ఎంవీ రాజు పేర్కొన్నారు. ఆదివారం రుషికొండ బీసీ స్టడీ సర్కిల్‌లో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ సదస్సులో ఆయన మాట్లాడారు. ఆరోగ్యంపై దృష్టిసారించడంతో పాటు సమయపాలన పాటిస్తూ పాఠ్యాంశాలను చదవాలని సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కె. రామారావు మాట్లాడుతూ క్రమశిక్షణ, దృఢసంకల్పంతో పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. డీఈవో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి, జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులను ఆహ్లాదపరచడానికి రుషికొండ వేంకటేశ్వర స్వామి దర్శనం, కురుసుర సబ్ మెరైన్ మ్యూజియం, టీయూ 142 మ్యూజియం, ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియానికి తీసుకువెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి



సౌజన్య (ఫైల్‌ఫొటో)

పూసపాటిరేగ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : విజయనగరం జిల్లా పూసపాటిరేగలోని కనిమెట్ట జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయిని బి. సౌజన్య దుర్మరణం చెందారు. మృతురాలు భోగాపురంలోని పోలిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖలో నివాసం ఉంటున్న సౌజన్య, భర్త కింగువ రవికుమార్, ఇద్దరు పిల్లలు, అత్త భోగి భవానీతో గతనెల 27న కారులో కుంభమేళాకు వెళ్లారు. తిరిగి వస్తుండగా ఆదివారం తెల్లవారుజామున కనిమెట్ట వద్ద విశాఖ వైపు వెళ్తున్న లారీని కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో డ్రైవర్ వెనుకవైపు కూర్చొన్న సౌజన్య తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్, భవానీలకు గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ దుర్గా ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

పాలిటెక్నిక్ కోర్సులతో ఉపాధి అవకాశాలు

తగరపువలస, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ కోర్సు అభ్యసించిన వారికి ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సీహెచ్ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రగ్యాన్ 2కె 25 పేరుతో పాలిసెట్ నమూనా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సులు చదవడం వల్ల త్వరగా ఉద్యోగం పొందవచ్చన్నారు. శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం ఎపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హెచ్‌ఆర్ హెచ్‌వోడీ కె. కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఫార్మసీ రంగంలో అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా నమూనా పరీక్షకు విజయనగరం, విశాఖ జిల్లాల్లోని పలు కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.10వేలు, రూ. 7వేలు, రూ. 3,500 నగదుతోపాటు ప్రశంసాపత్రాలను అతిథులు అందజేశారు.

ఒడిశాకు అప్పన్న ప్రచార రథం



ప్రచార రథం ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు

సింహాచలం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఒడిశాలో ప్రచార నిమిత్తం అప్పన్న రథం ఆదివారం బయలుదేరింది. కొండదిగువ తొలిపావంచా వద్ద దేవాలయ ఏఈఓ ఆనందకుమార్ జెండా ఊపి రథాన్ని ప్రారంభించారు. అంతకుముందు ఆలయ వైదికులు రథంలోని స్వామివారికి షోడశోపచారాలు సమర్పించి పూజలు చేశారు. ఈనెల 6వ తేదీ వరకు ఒడిశాలోని పట్టుపురం, విష్ణుచక్రపురం, తదితర ప్రాంతాల్లో ప్రచార రథం పర్యటించి, ఆయా ప్రాంతాల్లో ఉదయం నారసింహ హోమం, సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవాలు జరుపుతారు.

పిల్లల మధ్య స్నేహ భావం కోసం వీసీసీ కృషి



వీసీసీ భీమిలి జోన్ క్లబ్ నూతన కార్యవర్గం

తగరపువలస, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పిల్లల మధ్య స్నేహ భావం పెంపొందించేందుకు వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ కృషి చేస్తుందని ఆ క్లబ్ జిల్లా సంయుక్త కార్యదర్శి డి. శైలజ అన్నారు. ఆదివారం చిట్టివలసలోని సీఐటీయూ కార్యాలయంలో క్లబ్ భీమిలి జోన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలే ప్రపంచంలో అత్యంత విలువైన సంపదని, వారికి పౌష్టికాహారం లోపం లేకుండా జాగ్రత్త పడాలన్నారు. పిల్లల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత పెంపొందించడం, సంస్కృతి, కళలు నేర్పించడం వీసీసీ లక్ష్యమన్నారు. అనంతరం వీసీసీ భీమిలి జోన్ కమిటీ ఎన్నిక జరిగింది. కన్వీనర్‌గా తేజ, కో కన్వీనర్లుగా కె. నాగరాణి, ఎస్. గుణమ్మ, శిరీష, పుష్ప, దుర్గ, ప్రెసిడెంట్‌గా ఝాన్సీ, సెక్రటరీగా సౌమ్య, ఉపాధ్యక్షుడిగా శేషు, జాయింట్ సెక్రటరీగా చాందినీ ఎన్నికయ్యారు.





ఆంధ్రజ్యోతి సీనియర్ సబ్ ఎడిటర్ చిన్ని కృష్ణ, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ రామకృష్ణను సన్మానిస్తున్న నిర్వాహకులు

క్రీడలపై ఆసక్తి చూపాలి

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపాలని ఏయూ పూర్వ వీసీ ఆచార్య జి. నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం ఆయన స్థానిక బీవీకే కళాశాలలో జరిగిన సాంస్కృతిక కళావేదిక 30వ వార్షికోత్సవంలో మాట్లాడారు. చిన్నారులు క్రమశిక్షణతో మెలిగి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నండూరి రామకృష్ణ తమ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. అలాగే ఇటీవల తమిళనాడులో జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులతో పాటు సీనియర్ జర్నలిస్టులను నిర్వాహకులు సన్మానించారు. కళావేదిక గౌరవాధ్యక్షుడు కమల్‌బైద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కైలాసగిరికి సందర్శకుల తాకిడి



లవ్ ఎంబ్లమ్ వద్ద పర్యాటకులు

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరికి సందర్శకులు ఆదివారం అధికంగా తరలివచ్చారు. నగరంలోని నలుమూలలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలిరావడంతో కైలాసగిరి పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. లవ్ సింబల్, పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలు, సెల్ఫీ పాయింట్ వద్ద కొందరు సెల్ఫీలు తీసుకుని సందడి చేయగా మరికొందరు జిప్ లైన్, స్కై సైక్లింగ్ చేస్తూ ఆనందంగా గడిపారు.

కల్యాణ మండపాల వేలాన్ని నిరసిస్తూ రిలే దీక్ష

సింహాచలం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం పరిధిలో జరిగే వివాహ శుభ కార్యాలకు దేవస్థానం మండపాలను ఉచితంగా ఇవ్వాలని సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సమితి జేఏసీ కన్వీనర్ పూడి పెద్ది శర్మ కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండపాల వేలం రద్దు చేయాలని కోరుతూ సోమవారం నుంచి రిలే దీక్ష చేపట్టనున్నట్టు తెలిపారు. కొండదిగువ తొలిపావంచా వద్ద దీక్షా శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

రుషి సమానుడు శ్రీరాముడు : చాగంటి

కొమ్మాది, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ధర్మం విషయంలో తప్ప ఇతర భౌతిక అంశాలపై ఆసక్తి లేని రుషి సమానుడు శ్రీరాముడు అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో జరుగుతున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా ఆదివారం ఆయన అయోధ్య కాండను వివరించారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయ ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

తీరానికి కప్పలు, తాబేళ్ల కళేబరాలు



సాగర్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తీరానికి తాబేళ్ల, కప్పల కళేబరాలు తరచూ కొట్టుకు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఆదివారం సాగర్‌నగర్ తీరానికి పసుపు రంగు కప్ప కళేబరం కొట్టుకువచ్చింది. సముద్రంలో మాత్రమే జీవించే ఈ కప్పలను తమిళనాడు, మరికొన్ని ప్రాంతాల్లో ఆహారంగా తీసుకుంటారు. బంతి ఆకారంలో కనిపిస్తున్న ఈ కప్పను బీచ్‌కు వచ్చిన సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో భక్తుల రద్దీ

సింహాచలం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మాఘ మాసంతో పాటు ఆదివారం కావడంతో వందలాది మంది స్వామివారికి దర్శనానికి తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.పార్కింగ్ స్థలాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. దర్శనాల క్యూలో, తీర్థం కోసం లక్ష్మీనారాయణుల సన్నిధి వద్ద, ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద రద్దీ కనిపించింది.

ధ్రువిక ఆర్యనకు నేషనల్ స్పీచ్ చాంపియన్ షిప్

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన ధ్రువిక ఆర్యన నేషనల్ స్పీచ్ చాంపియన్ షిప్ సాధించింది.లీడ్ గ్రూపునకు సంబంధించిన ఎడ్‌టెక్ కంపెనీ న్యూఢిల్లీ క్రౌన్ ప్లాజాలో గతనెల 31న ఈ పోటీ లు నిర్వహించగా సీనియర్ విభాగంలో పాల్గొని ఈ ఘ టన సాధించింది. దేశం నలుమూలల నుంచి 1.9 లక్షల మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. కాగా ధ్రువిక ఆర్యన నగరంలోని భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతుంది. గతంలో కూడా ఈ బాలిక నేషనల్ స్పీచ్ చాంపియన్ షిప్ జూనియర్స్ విభాగంలో పాల్గొని వరుసగా రెండుసార్లు విజేతగా నిలి చింది. ఇప్పుడు మరోసారి చాంపియన్ షిప్ సాధించి, హ్యాట్రిక్ విజేత అయ్యింది.

ప్రమాదాల నియంత్రణపై సీపీ ఫోకస్

... 5వ పేజీ తరువాయి

దృష్టిసారించారు. తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ రూపొందించారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి బ్లాక్‌స్పాట్‌లుగా మార్కింగ్ చేయాలని ట్రాఫిక్ విభాగం అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నగరంలో 68 చోట్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించడంతో వాటిని బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరగడానికి గల కారణాలను గుర్తించి, సమస్యను పరిష్కరించాలని సీపీ ఆదేశించారు. బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన చోట ట్రాకోప్స్, రోడ్‌సేఫ్టీ, హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ చేయడంతోపాటు, ప్రమాదకరంగా వాహనాలను నడిపేవారిని గుర్తించి కేసులు నమోదుచేయాలని ఆదేశించారు. బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించిన చోట రోడ్ల డిజైన్ సరిగా లేకపోయినా, జంక్షన్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంటే జీవీఎంసీ అధికారుల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. షీలానగర్ జంక్షన్ నుంచి గాజువాక వరకు ఏడు చోట్ల తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనాలను భద్రంగా నడిపేలా డ్రైవర్లకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే బ్లాక్‌స్పాట్‌ల వద్ద రబ్బరు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటుచేయడం, రాత్రిపూట డ్రైవర్లకు రోడ్డు మార్జిన్ స్పష్టంగా కనిపించేలా రేడియం రిఫ్లెక్టెడ్ స్టడ్స్ ఏర్పాటుచేయడం, డ్రైవర్లను అప్రమత్తంచేయడంతోపాటు అవగాహన కల్పించేలా బోర్డులను ఏర్పాటుచేయాలని సీపీ ఆదేశించారు. బ్లాక్‌స్పాట్‌లవద్ద లైటింగ్ సదుపాయం, చెట్లు, పొదలు అడ్డంగా ఉంటే వాటిని జీవీఎంసీ సహకారంతో ట్రిమ్మింగ్ చేస్తున్నారు.

ట్రాఫిక్‌సిగ్నల్స్‌కు ఏఐతో అనుసంధానం

నగరంలో చాలామంది వాహనచోదకులు తరచూ ట్రాఫిక్ సిగ్నల్ జంపింగ్‌కు పాల్పడుతూ ప్రమాదాలకు గురవడం, లేదా ప్రమాద కారకులుగా మారుతున్నారు. దీంతో ట్రాఫిక్‌సిగ్నల్స్‌కు ఏఐ టెక్నాలజీని అనుసంధానం చేయాలని సీపీ నిర్ణయించారు.ముందుగా నగరంలోని 110 కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏఐతో అనుసంధానించేందుకు జీవీఎంసీ టెండర్లు పిలిచింది. ఇది పూర్తయితే హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా, ట్రిపుల్‌రైడింగ్ చేసినా, సిగ్నల్ జంపింగ్ చేసినా, అపరిమితవేగంతో వాహనం నడిపినా ఆటోమెటిక్‌గా జరిమానా చాలానా జారీ అయిపోతుంది. దీనివల్ల ట్రాఫిక్ సిగ్నల్స్ జంపింగ్‌లకు శతశాతం అడ్డుకట్టపడి, రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని సీపీ భావిస్తున్నారు. దీంతోపాటు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు,ఆటోడ్రైవర్లు, భారీవాహనాల డ్రైవర్లకు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీ నిర్ణయించారు. ఇవన్నీ చేస్తూ వాహనాల వేగాన్ని నియంత్రించేలా శివారు ప్రాంతాల్లో లేజర్‌స్పీడ్ గన్ వాహనాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు, నో హెల్మెట్ డ్రైవ్‌ను నిరంతరం కొనసాగించడం వల్ల ఫలితాలు సాధించవచ్చని సీపీ భావిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలకు మంగళం?

... 5వ పేజీ తరువాయి

మూత, ఉన్న విద్యార్థులను మోడల్ ప్రాథమిక పాఠశాలకు తరలించడం వల్ల 40 మందికిపైగా సెకండరీ గ్రేడ్ టీచర్లు మిగులుతారు.

యూపీ పాఠశాలలకు మంగళం?

జిల్లాలో 29 ప్రాథమికోన్నత పాఠశాలలుండగా వీటిని ఏడింటిని ఉన్నత పాఠశాలలుగా ఇప్పటికే అప్‌గ్రేడ్ చేశారు. మరో నాలుగింటిని హైస్కూల్ స్థాయికి పెంచాలని ప్రతిపాదించారు. కాగా ఆరుచోట్ల యూపీ పాఠశాలలు మూతపడనున్నాయి. మిగిలిన 12 పాఠశాలలను యథావిధిగా కొనసాగించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇదిలావుండగా ఉన్నత పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను వెనక్కి తీసుకువచ్చి, పంచాయతీల్లో ఏర్పాటుచేసే మోడల్ పాఠశాలలకు పంపిస్తారు. ఈ తరగతులు వెనక్కి తేవడం, యూపీ పాఠశాలల రద్దు వంటి కారణాలతో జిల్లాలో సుమారు 100 స్కూలు అసిస్టెంట్ పోస్టులు మిలిపోయే అవకాశం ఉంది. గ్రామాల్లోని పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతుల్లో తక్కువ విద్యార్థులుంటే వారిని సమీప పాఠశాలకు తరలిస్తారు. ఈ క్రమంలో వారికి రవాణా చార్జీలు ఇస్తారని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతులకు ఉన్నత పాఠశాలలకు తరలించడంతో సర్కార్ పాఠశాలలకు మంగళం పాడే ప్రక్రియ ప్రారంభమయింది. దీంతో అధికశాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పది, అంతకంటే తక్కువకు పడిపోయింది. కాగా జిల్లా విద్యాశాఖ తాజాగా చేపట్టిన ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించి, ఆమోదించిన తరువాత ప్రభుత్వానికి పంపుతారు.

సచివాలయాల హేతుబద్ధీకరణ

... 5వ పేజీ తరువాయి


మంజూరయ్యాయి. ప్రస్తుతం 5,170 మంది పనిచేస్తుండగా 453 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రామీణ సచివాలయాల్లో 966 పోస్టులు మంజూరుచేయగా 870 మంది, జీవీఎంసీలో 4,657 పోస్టులకుగాను 4,300 మంది పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో 60, నగరంలో 393 పోస్టులు ఖాళీ ఉన్నాయి. 400 మంది వివిధ కారణాలతో సెలవులో ఉన్నారు. హేతుబద్ధీకరణ చేసే క్రమంలో 2,500 కంటే తక్కువ జనాభా ఉన్న సచివాలయాల్లో ఆరుగురు, 2,500 నుంచి 3,500 మధ్య ఉన్న సచివాలయాల్లో ఏడుగురు, 3,500 మంది కంటే ఎక్కువ ఉన్న సచివాలయాల్లో ఎనిమిది మంది సిబ్బంది ఉంటారు. ఈ మేరకు మండలాల వారీగా కసరత్తు జరుగుతోంది. జీవీఎంసీ పరిధిలో 25 లక్షల జనాభాకు 551 సచివాలయాలు ఏర్పాటు చేశారు. సగటున ఒక సచివాలయం పరిధిలో నాలుగువేల కంటే ఎక్కువ జనాభా ఉన్నారని అధికారులు చెబుతున్నారు. మూడు కేటగిరీలుగా విభజించి సిబ్బందిని హేతుబద్ధీకరించాలని నిర్ణయించారు. ప్రస్తుతం జిల్లాలో మెజారిటీ సచివాలయాల్లో ఎనిమిది మందికి మించి సిబ్బంది లేరని, 453 ఖాళీలు ఉండడంతో సరిపోతారని భావిస్తున్నారు. హేతుబద్ధీకరణ తరువాత పంచాయతీ కార్యదర్శి/ వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులను గ్రామ/వార్డు హెడ్‌గా పిలుస్తారు.సచివాలయాలపై పర్యవేక్షణకు మండల, జిల్లాస్థాయిలో వేర్వేరుగా కార్యాలయాలు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమిస్తారు.

విమ్స్‌కు అధునాతన వైద్య పరికరాలు

... 5వ పేజీ తరువాయి

అందించేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా అల్సర్ల నిర్ధారణ, గ్యాస్ట్రిక్, పేగులు వరుపు వంటి సమస్యల నిర్ధారణకు ఎండోస్కోపీ, పెద్దపేగు సమస్యలను గుర్తించడానికి, పేగు కేన్సర్లు, ఫిస్టులాతోపాటు మరిన్ని సమస్యలను నిర్ధారించేందుకు కొలనోస్కోపీ చేస్తారు. అలాగే పాంక్రియాస్ కేన్సర్, స్టోన్స్, గాల్ బ్లాడర్ స్టోన్స్, పచ్చ కామెర్లు నిర్ధారణకు ఎండోస్కోపిక్ రిట్రోగ్రేడ్ కొలాంజియో పాంక్రియాటోగ్రఫీ (ఈఆర్‌సీపీ) పరీక్ష చేస్తారు. సూక్ష్మ కణితుల నిర్ధారణ, కొన్ని రకాల కేన్సర్ కారకాల నిర్ధారణకు ఎండోస్కోపిక్ అల్ట్రా సోనోగ్రఫీ పరీక్ష నిర్వహిస్తారు. వీటితో పాటు మరిన్ని రకాల వ్యాధుల నిర్ధారణకు సిగ్మాయిడ్ స్కోపీ, సైడ్ వ్యూ ఎండోస్కోపీ పరీక్షలు చేస్తారు. ఈ పరికరాల సహాయంతో ఇప్పటివరకూ 864 మందికి ఎండోస్కోపీ, 45 మందికి ఈయూఎస్, 546 మందికి కొలనోస్కోపీ, సిగ్మాయిడో స్కోపీ 546 మందికి, 63 మందికి ఈఆర్‌సీపీ పరీక్ష నిర్వహించారు.

మెరుగైన సేవందించేందుకు దోహదం



ప్రభుత్వం అందించిన అడ్వాన్స్‌డ్ పరికరాల సహాయంతో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించగలుగుతున్నాం. జీర్ణకోశం, అన్న వాహిక, కడుపులో అల్సర్లు, కేన్సర్లను గుర్తించడంలో ఈ పరికరాలు కీలకంగా మారుతున్నాయి. పెద్ద పేగు కేన్సర్లు, ట్యూమర్లను గుర్తిస్తున్నాం. ప్రతి రోజూ ఆయా పరికరాల సహాయంతో ఐదుగురికి అయినా పరీక్షలు చేస్తున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయి. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సమాచారం ఉంది.

- డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

రథసప్తమి వేడుకలకు సన్నాహాలు

సింహాచలం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : సూర్య జయంతి పురస్కరించుకుని ఈనెల 4న సింహగిరిపై రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో రాతి రథంపై ఉంచి పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఇసుకతోటలోని రామాలయం వీధిలో ఓ ఇంటి తాళం పగులగొట్టి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో నివాసం ఉంటున్న అపారి అప్పలనాయుడు తమ కుటుంబంతో శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల తర్వాత ఓ ఫంక్షన్ నిమిత్తం బయటకు వెళ్లారు. శనివారం ఉదయం తిరిగి ఇంటికి చేరుకొనే సరికి తలుపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని హ్యాండ్ బ్యాగ్, పన్నెండు గ్రాముల బంగారు గొలుసు, రూ.5 వేలు పోయినట్టు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో కారును నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడిపి ఇద్దరికి తీవ్ర గాయాలు కావడానికి కారణమైన డ్రైవరుపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి వెంకోజీపాలెం నుంచి హనుమంతువాక వైపు తమ ద్విచక్ర వాహనంపై వెళుతున్న మద్దిలపాలెం చైతన్యనగర్‌కు చెందిన పుక్కళ్ల కుమార్ స్వామి, కుంద శ్రావణ్ కుమార్‌లు సీఎమ్మార్ ఫంక్షన్ హాలు ఎదురుగా పళ్ల దుకాణం వద్ద కొనడానికి ఆగారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం వీరిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రగాయాలైన క్షతగాత్రులను పోలీసులు విమ్స్ ఆసుపత్రికి తరలించారు. సీఐ మురళీ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జిల్లా సీనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక పోటీలను సోమవారం సాలిగ్రామపురంలోని పోర్టు హాకీ గ్రౌండ్‌లో నిర్వహిస్తామని హాకీ విశాఖ సంఘం కార్యదర్శి కె.వి.ఆంజనేయరావు (అంజి) తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనేవారు 1996 జనవరి 1న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల క్రీడాకారులు సోమవారం 3.30 గంటలకు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో సాలిగ్రామపురం హాకీగ్రౌండ్‌లో హాజరు కావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైనవారు ఈ నెల 8 నుంచి నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్:9885199535లో సంప్రదించాలన్నారు.

9 నుంచి లలితా పీఠం బ్రహ్మోత్సవాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 26వ వార్డు లలితానగర్‌లోని లలితా పీఠం76వ బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు పీఠం ఆవరణలో జరుగనున్నట్లు కుర్తాళం సిద్ధేశ్వరి పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి తెలిపారు. ఈ మేరకు లలితపీఠం ఆవరణలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు.

సినిమా గైడ్

● **మదగజరాజ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
● **మహిష :** రమాదేవి
● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 29, టమాటా 12, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 24 దొండకాయలు 36, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)44, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 24, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, కీరదోస 32, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 24, గోరు చిక్కుడు 26, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	490
విజయనగరం	494
శ్రీకాకుళం	494

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

పదేళ్లయినా పరిష్కారం కాని డ్రైనేజీ సమస్య

» ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
» ఇప్పుడు ఎన్నికల కోడ్ అంటూ దాటవేత


మురుగు రోడ్డు పైకి చేరడంతో చిత్తడిగా మారిన పాత వెంకోజీపాలెం ప్రధాన రహదారి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ తీరని సమస్యగా మిగిలిపోయింది. గత పదేళ్లుగా ఈ సమస్య వెంటాడుతూనే ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడి పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు.

మంచినీటి ప్రధాన పైపులైను ఉండడంతో నేరుగా దిగువ ప్రాంతానికి కనెక్షన్ ఇవ్వకుండా కొండవాలు ప్రాంతం నుంచి వచ్చే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని పాత వెంకోజీపాలెం జంక్షన్ వద్ద మలుపు తిప్పారు. ఈ మలుపు వద్ద ఏవైనా అడ్డంకులు ఉంటే మురుగునీరు డ్రైనేజీ నుంచి కాకుండా పైకి పొంగి దిగువ ప్రాంతాలకు వరదలా పారుతుంది. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనచోదకులు, పాదచారులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ఈ మురుగు నీరు నేరుగా దిగువ ప్రాంతంలో ఉన్న ఇళ్లలోకి కూడా చేరుతోంది.


తవ్వి వదిలేయడంతో అధ్వానంగా ఉన్న వీధులు


ప్రధాన మార్గంలో పొంగిపొర్లుతున్న మురుగునీరు

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు పాత వెంకోజీపాలెం గవర వీధిలో నూతనంగా పైపలైను వేశారు. అయితే ఇందుకోసం తవ్విన గోతులను మాత్రం అసంపూర్తిగా వదిలేశారు. గత రెండు నెలలుగా ఈ సమస్య వేధిస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే ఇరుకు రోడ్లు, అందులోనూ గోతుల కారణంగా చిన్నారుల నుంచి పెద్దల వరకు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యపై శాశ్వత పరిష్కారాన్ని చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడంతో..

ప్రస్తుతం నగరంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అందువల్ల డ్రైనేజీ సమస్యకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేకపోతున్నాం. అయితే తాత్కాలిక ఉపశమనం పనులు పూర్తి చేశాం. ఈ సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే దిగువ, ఎగువ ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పునరుద్ధరించాం. జంక్షన్‌లో ప్రధాన మంచి నీటి పైపులైను ఉండటం వలన కనెక్షన్ కలిపే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ పనులు చేపట్టేందుకు టెండర్ సిద్ధం చేశాం. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పాత వెంకోజీపాలెం జంక్షన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్‌ను కలుపుతాం. త్వరలోనే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

- రహీమ్, ఏఈ, యూజీడీ

బడుగులకు చేయూత అందించిన కేంద్ర బడ్జెట్

» బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు



విలేకరులతో మాట్లాడుతున్న పరశురామ్‌రాజు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, బడుగు, బలహీన వర్గాలకు చేయూతనిచ్చే విధంగా ఉందని బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం లాసన్స్ బే కాలనీలో గల బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో దేశంలోని గ్రామాలు, పట్టణాలు, నగరాలు అభివృద్ధి చెందే విధంగా బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు చేశారని, పేదరికం లేని సమాజం, రైతులకు పూర్తి సహకారం, తక్కువ ఖర్చుతో విద్య, వైద్యం, నైపుణ్య శిక్షణకు పెద్ద పీట వేశారన్నారు. వ్యవసాయం, ఎంఎస్ఎంఈ పెట్టుబడులు, ఎగుమతులకు ప్రోత్సాహం, మధ్య తరగతి వర్గాలకు ఆదాయ పరిమితి పెంపు వంటివి ఉత్తమంగా ఉన్నాయన్నారు. రాష్ట్రానికి గత ఏడు నెలల్లో రూ.3 లక్షల కోట్లు కేటాయించారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు డి.ధనేశ్వరరావు, పి.శ్రీనివాస్, దామోదర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆర్థోసర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు

» ఆర్థో సర్జన్ల సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ అశోక్ కుమార్ ఎంపిక


నూతన అధ్యక్షుడు డాక్టర్ అశోక్ కుమార్‌తో వైద్యులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరుగుతున్న ఏపీ ఆర్థో సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు ఆదివారంతో ముగిసింది. నాలుగో రోజు సదస్సులో వివిధ అంశాలపై వైద్యులు చర్చించారు.

ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆర్థో వైద్యుడు డాక్టర్ గురువారెడ్డి మాట్లాడుతూ కీళ్ల మార్పిడి, వాటి అరుగుదల, నూతన వైద్య విధానాలు, శస్త్ర చికిత్సలపై గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కలిగించాలన్నారు. కీళ్ల మార్పిడికి సంబంధించి ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే ఇబ్బందులు లేకుండా జీవనం సాగించవచ్చన్నారు. మరో ఆర్థో వైద్య నిపుణుడు డాక్టర్ కృష్ణ కిరణ్ మాట్లాడుతూ జాయింట్ రీ ప్లేస్‌మెంట్, హిప్ రీ ప్లేస్‌మెంట్ విభాగాలపై కూడా వైద్యులు, వైద్య విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

అనంతరం సభ్యులు ఆర్థోపెడిక్ సర్జన్ల సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యక్షుడిగా సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్‌ను ఎన్నుకున్నారు. వచ్చే ఏడాది రాష్ట్రస్థాయి సదస్సును కర్నూలులో నిర్వహించాలని నిర్ణయించారు. నాలుగు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో ఆరు లైవ్ సర్జరీలు, ఐదు వర్క్‌షాప్‌లు నిర్వహించగా, 150 మంది వైద్యులు పాల్గొన్నారు.

సమావేశంలో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ శివానందతో పాటు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎల్ఎస్ లోకనాథ్, వైద్యులు వర్మ, వీవీకే, రమేశ్ సేన్, విజయ్, అచ్యుత్ పాల్గొన్నారు.

'కేన్సర్‌పై ప్రజలకు విస్తృత అవగాహన అవసరం'

» భీమిలి ఎమ్మెల్యే గంటా



సమావేశంలో మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు

రామ్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏటా కేన్సర్‌రోగులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ కేన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 4న కేన్సర్ దినం సందర్భంగా యునైటెడ్ బై యునిక్యూ థీమ్‌తో ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులో వాకథాన్ నిర్వ హించారు.ఇందులో ఆరోగ్య సంస్థలు, వైద్య కళాశాలలు, వైద్య విద్యార్థులు, ఎన్‌జీవో సంస్థలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవ గాహన కలిగించేందుకు ఆస్పత్రి యాజమాన్యం విశేషంగా కృషి చేస్తోందన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి వల్ల ఏటా కొన్ని లక్షల మంది మృతి చెందుతున్నారన్నారు. ఈ మహమ్మారిపై అవగాహన ఉంటే మరణాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. కేన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీ కృష్ణ మాట్లాడుతూ ప్రజల్లో కేన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగించేందుకు సామాజిక బాధ్యతగా ఏటా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తిం చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, నగరానికి చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు.

చెట్టును చెక్కేశారు

» జీవీఎంసీ అధికారుల తీరుపై స్థానికుల విస్మయం


జీకే మాన్షన్స్ అపార్ట్‌మెంట్ వద్ద కొమ్మలు నరికేసిన చెట్టు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పెంపకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండగా, మరోవైపు జీవీఎంసీ వృక్షాలను నరికేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెదవాల్తేరు జంక్షన్ జీకే మాన్షన్స్ అపార్ట్‌మెంట్, బ్యాంక్ ఆఫ్ బరోడాకు ఎదురుగా ఉన్న రావి చెట్టు వల్ల ఎలాంటి ఇబ్బంది లేనప్పటికీ శనివారం జీవీఎంసీ సిబ్బంది తెగ నరికేశారు. నిన్నటి వరకు పెద్ద కొమ్మలతో ఆ ప్రాంతానికే ప్రత్యేక గుర్తింపుగా ఉన్న రావి చెట్టును నరికేయడంతో స్థానికులు ఆవేదనకు గురవుతున్నారు. కొందరు చెట్టు కొమ్మలను నరుకుతున్న వారిని నిలదీశారు. ఈ విషయమై వాగ్వాదం కూడా జరిగింది. అయితే అధికారుల ఆదేశాల ప్రకారం తాము ఇలా చేస్తున్నామని కూలీలు చెప్పడంతో చేసేదేం లేక స్థానికులు మిన్నకుండిపోయారు.

ఎప్పుడైనా వీధుల్లో కొమ్మలు నరికితే, వాటిని రోజుల తరబడి అక్కడ నుంచి తరలించని జీవీఎంసీ అధికారులు.. ఈ రావిచెట్టు కొమ్మలను పూర్తిగా తీసి వేయించిన తర్వాత వెంటనే తరలింపునకు చర్యలు తీసుకోవడం గమనార్హం. అసలు అక్కడ ఏం జరగనట్టే ఆనవాళ్లు లేకుండా చేశారు. కాగా, పక్కన ఓ ఇంటి నిర్మాణాన్ని చేపట్టనున్న నేపథ్యంలో అడ్డుగా ఉంటుందనే నెపంతో జీవీఎంసీ అధికారులు రావి చెట్టును నరికించేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



వాహనంలో కొమ్మలు తరలిస్తున్న దృశ్యం

మేయర్ క్యాంపు కార్యాలయానికి మినహాయింపు ఎందుకో?

» ఎన్నికల కోడ్ వేళ మాజీ సీఎం ఫ్లెక్సీలను తొలగించని జీవీఎంసీ సిబ్బంది

ఆరిలోవ. ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఎమ్మెల్సీ కోడ్ ఎన్నికల కోడ్ ఆమలులోకి రావడంతో అన్ని రాజకీయ నాయకులు ఫ్లెక్సీలను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. అయితే ఆరిలోవలో మాత్రం పెదగదిలిలో మేయర్‌క్యాంప్ కార్యాలయం వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫ్లెక్సీ మాత్రం తొలగించకపోవడం చర్చనీయాంశమైంది.

పలు చోట్ల ఉన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఫ్లెక్సీలను జీవీఎంసి సిబ్బంది ఆదివారం ఉదయం హడావుడిగా తొలగించారు. కానీ మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న ఫోటోలు, ఫ్లెక్సీలను మాత్రం తొలగించలేదు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'నగర ప్రథమ పౌరురాలికి ఎన్నికల కోడ్ వర్తించదా?' అంటూ అంతా గుసగుసలాడుకుంటున్నారు.


మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద తొలగించని మాజీ సీఎం ఫ్లెక్సీలు


జూలో ప్రత్యేక ఆకర్షణగా ఉంటూ సందర్శకులను మురిపిస్తున్న ఏనుగుల జంట

జూలో ప్రత్యేక ఆకర్షణగా ఏనుగుల ద్వయం

ఆరిలోవ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో ఏనుగుల ద్వయం సందర్శకులను ఎంతగానో అలరిస్తోంది. సందర్శకులు వచ్చేటపుడు రెండు ఏనుగులు మావటి పర్యవేక్షణలో చక్కగా ఆడుతూ ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా.. చిన్నారులు ఈ ఏనుగులను చూసి ముచ్చట పడుతున్నారు. సందర్శకులు తమ సెల్‌ఫోన్లలో ఏనుగులను బంధిస్తూ, సెల్ఫీలు దిగులూ ఆనందం పొందుతున్నారు.

కాగా, ఆదివారం ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలను సుమారు మూడు వేల 704 మంది సందర్శించారు. వీరి నుంచి రూ.3 లక్షల 25 వేల ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

సింహాచలం భూముల క్రమబద్ధీకరణపై హర్షం


సీఎం చంద్రబాబుకు క్షీరాభిషేకం చేస్తున్న కొండవాలు ప్రాంతవాసులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) :సింహాచలం దేవస్థానం భూములకు సంబంధించి సర్వే నెం.275లోని భూముల క్రమబద్ధీకరణ, పంచగ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేసిన కూటమి ప్రభుత్వ చర్యపై కొండవాలు ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా 15వ వార్డులోని కొత్త వెంకోజీపాలెంలో టీడీపీ సీనియర్ నాయకుడు బోర ధన రెడ్డి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబుతో పాటు కూటమి నేతలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, ఆడారి కామేశ్వరరావు, కాళ్ల శంకర్, ఎర్రాజీ రెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, వరలక్ష్మి, సోని, కె.మహేష్, జనసేన యడ్ల కళావతి, పి.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతిపై పలు అనుమానాలు

» కీలకంగా మారనున్న పోస్టుమార్టం నివేదిక!

గాజువాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గాజువాక సమీపంలోని శ్రీనగర్‌లో ఉరి వేసుకుని భాస్కరరావు అనే యువకుడు మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తుంది. భాస్కరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. ఆ యువకుడి తలపై బలంగా పిడుగుద్దులు గుద్దడం వల్ల తల భాగం మొత్తం ఉబ్బిపోవడం, నరాలు దెబ్బతిని రక్తప్రసరణ ఆగిపోయి మృతి చెంది ఉండవచ్చని వైద్యులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. శ్రీనగర్‌లో శుక్రవారం మృతి చెందిన భాస్కరరావు తమ పక్కింట్లోని యువతి స్నానం చేస్తుండగా సెల్ ఫోన్‌లో వీడియో తీశాడన్న అభియోగం నేపథ్యంలో యువతి కుటుంబ సభ్యులు యువకుడిని దారుణంగా కొట్టి గదిలో బంధించినట్టు భోగట్టా. ఈ సమాచారాన్ని శనివారం యువతి కుటుంబ సభ్యులు విజయనగరంలో ఉంటున్న భాస్కరరావు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఇక్కడకు వచ్చారు. దీంతో భాస్కరరావు ఉంటున్న ఇంటి తాళాన్ని యువతి కుటుంబ సభ్యులు తీశారు. అయితే అప్పటికే భాస్కరరావు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నట్టు గుర్తించారు. కాగా తొమ్మిది మంది వరకు భాస్కరరావుపై దాడి చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నా ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా నిందితులపై పోలీసులు చర్యలు చేపట్టనున్నారు. బలంగా కొట్టి తమ కుమారుడిని చంపేసి ఉరి వేసుకున్నట్టు యువతి కుటుంబ సభ్యులు చిత్రీకరిస్తున్నారని భాస్కరరావు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

జీవీఎంసీలో టీడీఆర్‌ల పేరుతో భారీ కుంభకోణం

» జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మూర్తియాదవ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) పేరుతో భారీ కుంభకోణం జరుగుతోందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. హోటల్ మేఘాలయలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ హయాంలో రూ. వందల కోట్ల విలువైన టీడీఆర్‌లను అడ్డదారిలో కొట్టేసేందుకు ఆ పార్టీ నాయకులు చేసిన ప్రయత్నాలను జనసేన పార్టీ అడ్డుకోవడంతో వాటిజారీ నిలిచిపోయిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే వైసీపీ నేతలు నిలిచిపోయిన టీడీఆర్‌లను జారీచేయాలని కోరుతూ కూటమికి చెందిన కొందరు నేతలను ప్రలోబపెట్టి జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. పాత గోశాల - అడవివరం బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయారంటూ 210 మందికి వైసీపీ హయాంలో రూ. 200 కోట్ల విలువ చేసే టీడీఆర్‌లు మంజూరు చేశారని గుర్తుచేశారు. అధికారులు చెబుతున్న 210 మందిలో కేవలం ఐదు గురు మినహా మిగిలిన వారికి యాజమాన్య హక్కులు లేవని, అలాంటపుడు టీడీఆర్‌లు ఎలా ఇచ్చారో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరుగుతుండగానే కొత్తగా 180 టీడీఆర్‌లు జారీకి పైరవీలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే జోన్-5 కప్పరాడ సర్వే నంబర్ 41/5లో సహజ సిద్ధంగా పారుతున్న గెడ్డ స్థలం తనదని, గెడ్డ ప్రవహిస్తున్న 19 సెంట్లు స్థలానికి రూ. 200 కోట్లు విలువైన టీడీఆర్ జారీ చేయాలంటూ ఒకరు దరఖాస్తు చేశారని, సర్వేయర్ రిపోర్టులో ఆ భూమి యూఎస్‌సీదని, గెడ్డ సహజ సిద్ధంగానే ఉందని పేర్కొంటూ నివేదిక ఇచ్చినా అధికారులు టీడీఆర్ జారీకి సిద్ధం కావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గీతం కళాశాలకు - రుషికొండకు మధ్య ఉన్న రోడ్డును 2005లో అప్పటి వుడా విస్తరణ చేపడితే, ఆ రోడ్డు విస్తరణలో తమ స్థలం 71 సెంట్లు పోయినందున టీడీఆర్ ఇవ్వాలంటూ ఇప్పుడు ఒకరు దరఖాస్తు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నగర పరిధిలో ఇటువంటివి చాలా జరుగుతున్నాయని చెప్పారు. భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం వల్ల జీవీఎంసీకి కేవలం రూ. 200 కోట్లు ఆదాయం వస్తోందని, అదే సమయంలో రూ.వెయ్యి కోట్ల విలువైన టీడీఆర్‌లను అనర్హులకు జారీ చేయడం వల్ల జీవీఎంసీకి కోలుకోలేని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

నగరంలో ఆరుగురిపై పీడీ యాక్ట్

మహారాణిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆరుగురు వ్యక్తులపై రాష్ట్రప్రభుత్వం పీడీ యాక్ట్ అమలు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వడ్లపూడి సమీపంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన రావాడ జగదీష్ (22), రావాడ ఉదయ్‌భాస్కర్ (22), ఈతలపాక రాజ్‌కుమార్ (22), వడ్లపూడి కణితి ఆర్‌హెచ్ కాలనీకి చెందినకాండ్రేగుల లోక్‌నాథ్, వీరసాయి శ్రీనివాస్(22), చినగదిలి సాయిబాబా ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న నక్కా లోకేష్ (26), పోతిన మల్లయ్యపాలెం ఆర్ హెచ్ కాలనీకి చెందిన కొలగాని పవన్ రాజ్‌కుమార్ (25)లపై ఈ చట్టం అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరు నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించటం, భూకబ్జాలు, దారిదోపిడీలకు పాల్పడటం, మనుషుల అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం వంటి నేరాలకు పాల్పడుతున్నందున ఈ చర్య తీసుకుంటున్నట్లు పేర్కొంది. సమాజానికి వీరివల్ల ప్రమాదం ఉన్నందున పోలీసు కమిషనర్, జిల్లా అధికార యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

9 నుంచి లలితా పీఠం బ్రహ్మోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు లలితానగర్‌లోని లలితాపీఠం 76వ బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు కుర్తాళం సిద్ధేశ్వరి పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి తెలిపారు. లలిత పీఠం ఆవరణలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, 10న ఉదయం 9 నుంచి లలితాకామేశ్వరుల ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం ఒంటి గంటకు మహాప్రసాద వితరణ, సాయంత్రం 6-30 గంటలకు లలితా కామేశ్వరుల కల్యాణోత్సవం జరుగుతుందని చెప్పారు. 11న ఉదయం అమ్మవారికి అన్నాభిషేకం, మధ్యాహ్నం 12 గంటల నుంచి బంగారు వాటికలో అమ్మవారి దర్శనం ఉంటుందన్నారు. సాయంత్రం లలితా అమ్మవారికి సహస్ర దీపాలంకార సేవ, సామూహిక కుంకుమ పూజ, 12న ఉదయం లలిత దీక్ష విరమణ, గురుపూజ, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఠం నిర్వాహక కార్యదర్శి డాక్టర్ వెంపరాల నరసింహమూర్తి, మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ తదితరులు పాల్గొన్నారు.

'ఐక్య పోరాటాలతో పోర్టు ఆసుపత్రిని రక్షించుకుంటాం'



మాట్లాడుతున్న నరేంద్ర కుమార్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాలతో పోర్టు ఆసుపత్రిని రక్షించుకుంటామని వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీడీ నందకుమార్, టి.నరేంద్రర్‌రావులు అన్నారు. విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు ఆదివారంతో 125వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ పోర్టు ఆసుపత్రి టెండర్‌కు వచ్చిన వారిని ఐక్య పోరాటాల ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి మసేను, ఇంటక్, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, శంకరరావు, కేఎస్ కుమార్, రాఘవులు, విజయ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఆర్‌జీఎస్ రద్దు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం జోనల్ కార్యాలయంలో జరగాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదికను మార్చి 8 వరకు రద్దు చేసినట్లు జోనల్ కమిషనర్‌లు ఎం.మల్లయ్యనాయుడు, బి.రాములు తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

నేడు జిల్లా సీనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక పోటీలను సోమవారం సాలిగ్రామపురంలోని పోర్టు హాకీ గ్రౌండ్‌లో నిర్వహిస్తామని హాకీ విశాఖ సంఘం కార్యదర్శి కె.వి.ఆంజనేయరావు (అంజి) తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనేవారు 1996 జనవరి 1న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల క్రీడాకారులు సోమవారం 3.30 గంటలకు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో సాలిగ్రామపురం హాకీగ్రౌండ్‌లో హాజరుకావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైనవారు ఈ నెల 8 నుంచి నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్:9885199535లో సంప్రదించాలన్నారు.

కాపుల అభ్యున్నతికి ఐక్యంగా కృషిచేయాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాపులందరూ ఐక్యంగా ఉంటూ పరస్పర సహకారంతో జాతి అభ్యున్నతికి కృషి చేయాలని కాపు సంక్షేమ భరోసా కేంద్రాల వ్యవస్థాపకుడు కర్రి వెంకట రమణ అన్నారు. అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని బస్టాప్ సమీపంలోని వంగవీటి మోహన్‌రంగా విగ్రహం వద్ద కాపు సంక్షేమ భరోసా కేంద్రాల సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కాపులకు ఎలాంటి ఆపద వచ్చినా వెంటనే సాయం చేసుకోవడమే ఈ భరోసా కేంద్రాల ఉద్దేశమన్నారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గాలకు కన్వీనర్లను నియమించారు. నాయకులు మణి, నందికోళ్ళ సుబ్బయ్యమ్మ, గొర్లె మూలకోటి, బారుకుల జగ్గారావు, తోట రామాంజనేయులు, వెలిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రేడ్ సాధనకు ప్రత్యేక తరగతులు



డాబాగార్డెన్స్ మహాత్మాగాంధీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకం. పదో తరగతి పరీక్షల్లో సాధించే మార్కులే పిల్లల భవితకు పటిష్ఠ పునాది వేస్తాయి. నిరుటి ఉత్తీర్ణత శాతాన్ని దృష్టిలో ఉంచుకుని ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధిస్తున్నారు. పదో తరగతి పరీక్షలను మార్చి 17 నుంచి నిర్వహించనున్నట్టు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంకా మిగిలి ఉన్న సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేస్తున్నారు. మహాత్మాగాంధీ ఉన్నత పాఠశాలలో మొత్తం 113 మంది విద్యార్థులుండగా, అందులో బాలురు 67 మంది, బాలికలు 46 మందికి రెండు పూటలా అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నారు. వెనుకబడిన వారిని గుర్తించి సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేకంగా బోధిస్తున్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసే దిశగా...

ప్రభుత్వం పరీక్షల తేదీలు ప్రకటించడంతో విద్యార్థుల్లో కొంత ఆందోళన మొదలయ్యింది. రోజులు సమీపిస్తున్నకొద్దీ పరుగులు పెట్టే కన్నా, ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళిక చేసుకుంటే పదో తరగతిలో పదిలంగా గట్టెక్కవచ్చు. సమాయన్ని సద్వినియోగం చేసుకోవడం ఎంతో ముఖ్యమని సాధనలో కీలక అంశాలు ఎన్నో వెలుగులోకి వస్తాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వాటిని నివృత్తి చేసుకుని, తమ సలహాలు పాటిస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చునని పేర్కొంటున్నారు.

90 శాతం ఉత్తీర్ణత లక్ష్యం..



పాఠశాలలోని పదో తరగతి పరీక్షలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు బోధిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. .గతేడాది కె.శైలజ అనే విద్యార్థిని 538 మార్కులు సాధించింది. 71 శాతం ఉత్తీర్ణత లభించగా, ఏడుగురు విద్యార్థులకు 500 మార్కులు లభించాయి. ఈ ఏడాది 90 శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో కృషి చేస్తున్నాం.

-నాగభూషణం, ప్రధానోపాధ్యాయుడు

అంతర్జాతీయ కరాటే చాంపియన్ భారత్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సినీనటుడు సుమన్

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మహిర షాటోకాన్ కరాటే డో ఇండియా నిర్వహించిన ఎనిమిదో ఆల్ స్టైల్స్ అంతర్జాతీయ కరాటే టోర్నీలో ఆతిథ్య భారత్ ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో శ్రీలంక, తృతీయ స్థానంలో నేపాల్ నిలిచాయి. పోర్టు రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి సినీ నటుడు సుమన్ తల్వార్, టీడీపీ యువ నాయకుడు మౌర్య సింహ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఏటా అంతర్జాతీయ స్థాయి టోర్నీని నిర్వహిస్తున్న షాటోకాన్ కరాటే డో ఇండియా ప్రతినిధులు అభినందనీయులన్నారు. అనంతరం టోర్నీ సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు షాబుద్దీన్, అలీ, వివిధ దేశాల కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో వసంత పంచమి వేడుకలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘం (అపస్) ఆధ్వర్యంలో 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఆదివారం సంఘ వార్షికోత్సవం, వసంత పంచమి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంఘం కార్యదర్శి ఐనాల అప్పారావు హాజరై ప్రసంగించారు. పుస్తక పఠనంతోనే జ్ఞానం వస్తుందన్నారు. చాలా మంది జీవితాల్లో వెలుగులు నింపిన వారే గురువని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అపస్ నగర ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ విశ్వనాథం, ప్రతినిధులు చిన్ని చిరంజీవి, ఎంపీ శ్రీనివాస్, సుదర్శన్, జేఎం నాయుడు, బి. రాధా కుమారి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వంగల అప్పలరాజు, వి.ఫణికుమార్, కేఎల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేన్సర్‌పై ప్రజలకు విస్తృత అవగాహన అవసరం



ప్రసంగిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



వాక్‌థాన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

మహారాణిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏటా కేన్సర్ రోగులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 4న కేన్సర్ దినం సందర్భంగా యునైటెడ్ బై యునిక్యూ థీమ్‌తో ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులో వాకథాన్ నిర్వహించారు. ఇందులో ఆరోగ్య సంస్థలు, వైద్య కళాశాలలు, వైద్య విద్యార్థులు, ఎన్‌జీవో సంస్థలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఆస్పత్రి యాజమాన్యం విశేషంగా కృషి చేస్తోందన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి వల్ల ఏటా కొన్ని లక్షల మంది మృతి చెందుతున్నారన్నారు. ఈ మహమ్మారిపై అవగాహన ఉంటే మరణాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. కేన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీ కృష్ణ మాట్లాడుతూ ప్రజల్లో కేన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగించేందుకు సామాజిక బాధ్యతగా ఏటా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, నగరానికి చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ముగిసిన టెన్నిస్ చాంపియన్ టోర్నీ



జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకున్న సీనియర్ విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అయిస్టా నిర్వహించిన సీఎంఆర్ సీనియర్, బాలల టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన సీనియర్ టెన్నిస్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, బాలల టోర్నీకి రిటైర్డ్ డీజీపీ డాక్టర్ ఎన్.సాంబశివరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమాలలో జీఎస్టీ కమిషనర్ ఎం.నాయక్, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ శాంతారావు, అయిస్టా ప్రతినిధులు డి.ఎస్.ఎన్.రాజు, ప్రేమ్‌చంద్, టోర్నీ డైరెక్టర్ సతీష్, సిల్‌రాజు, సుధా, ఊర్మిళ గజపతిలు పాల్గొన్నారు.

టోర్నీ విజేతలు: సింగిల్స్ 35 ప్లస్ విభాగంలో కన్నన్ సేతు, విజయానంద్; 45 ప్లస్ విభాగంలో ఎంవీఎల్ఎన్.రాజు, జి.రమేష్; 55 ప్లస్ విభాగంలో మణికందన్, ఆర్ఎన్.రమేష్; 65ప్లస్‌లో వి.శ్రీనివాసరెడ్డి, 70ప్లస్‌లో ఎస్.సేతు, సన్యాసిరాజు విన్నర్, రన్నరప్‌గా నిలిచారు.

బాలల విజేతలు: బాలికల అండర్-12 విభాగంలో రాగ హర్షిణి, జి.సుదీక్ష; అండర్-14 విభాగంలో వి.పరిణిత, పి.సెవిత; బాలుర అండర్-12 విభాగంలో పి.రేవంత్ రిషి, కె.సత్య కృషి; అండర్-14 విభాగంలో పి.రేవంత్ రిషి, కార్తిక్ నరసింహ విన్నర్, రన్నరప్ ట్రోఫీలు సాధించారు. ఊర్మిళ, భరద్వాజ్, ఎంఎస్ఎల్‌వి. మన్విు, సంపత్ సాత్విక్‌లు ఉత్తమ ప్రతిభ అవార్డులు అందుకున్నారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు రేపు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా యూత్ బాలురు, బాలికల బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు మంగళవారం సాయంత్రం 4 గంటలకు పోలీసు బ్యారక్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నామని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం కార్యదర్శి భూషణరావు తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనేవారు 2009 జనవరి 1న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. వివరాలకు ఫోన్: 89196 49048, 99667 55209నందు సంప్రదించాలన్నారు.

మాఘ ఆదివారం పూజలు

అల్లిపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వరమెట్టపై వెలసిన అలవేలు మంగమ్మ దేవాలయ ప్రాంగణంలో ఉన్న ఉషా చాయా దేవి సమేత సూర్యనారాయణ స్వామికి మాఘ ఆదివారం పూజలు ఘనంగా జరిగాయి. స్వామి వారిని అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు సుందరంగా అలంకరించారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.





వార్షికోత్సవంలో భాగంగా ఆంధ్రజ్యోతి సబ్ ఎడిటర్ చిన్ని కృష్ణ, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ రామకృష్ణను సన్మానిస్తున్న నిర్వాహకులు

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపాలని ఏయూ పూర్వ వీసీ ఆచార్య జి. నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం ఆయన స్థానిక బీవీకే కళాశాలలో జరిగిన సాంస్కృతిక కళావేదిక 30వ వార్షికోత్సవంలో మాట్లాడారు. చిన్నారులు క్రమశిక్షణతో మెలిగి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నండూరి రామకృష్ణ తమ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. అలాగే ఇటీవల తమిళనాడులో జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులతో పాటు సీనియర్ జర్నలిస్టులను నిర్వాహకులు సన్మానించారు. కళావేదిక గౌరవాధ్యక్షుడు కమల్‌బైద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఆరుగురిపై పీడీ చట్టం అమలు

మహారాణిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆరుగురు వ్యక్తులపై రాష్ట్రప్రభుత్వం పీడీ చట్టం అమలు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వడ్లపూడి సమీపంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన రావాడ జగదీష్ (22), రావాడ ఉదయ్‌భాస్కర్ (22), ఈతలపాక రాజ్‌కుమార్ (22), వడ్లపూడి కణితి ఆర్‌హెచ్ కాలనీకి చెందిన కాండ్రేగుల లోక్‌నాథ్, వీరసాయి శ్రీనివాస్(22), చినగదిలి సాయిబాబా ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న నక్కా లోకేష్ (26), పోతిన మల్లయ్యపాలెం ఆర్ హెచ్ కాలనీకి చెందిన కొలగాని పవన్ రాజ్‌కుమార్ (25)లపై ఈ చట్టం అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించటం, భూకబ్జాలు, దారిదోపిడీలకు పాల్పడటం, మనుషుల అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం వంటి నేరాలకు పాల్పడుతున్నందున వీరిపై ఈ చర్య తీసుకుంటున్నట్లు పేర్కొంది. పోలీసు కమిషనర్, జిల్లా అధికార యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వానికి చర్య తీసుకోవాలని సిఫార్సు చేశారు.

నవ్వు...ఆరోగ్య సంజీవని

డాబాగార్డెన్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నవ్వు...ఆరోగ్యానికి సంజీవని వంటిదని ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం సాయంత్రం పౌరగ్రంథాలయంలోని ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ విశాఖపట్నం, హైదరాబాద్ ఆధ్వర్యంలో 'వినోదాల విందు-కామెడీ షో' నిర్వహించారు. గౌరవ అతిథులు తిలక్ పట్నాయక్, సన్‌మూర్తి, మాల్యాద్రిలు జ్యోతి ప్రజ్వలన చేశారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం అందరూ ఒత్తిడికి గురవుతున్నందున కొద్దిసేపు అయినసరే.. హాయిగా నవ్వుకునేందుకు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. తదుపరి వడ్డాణం....సెల్‌ఫోన్...నూడల్స్...పెదవి చిట్లింది.. తాగుబోతు...కోర్టుసీన్.. దొందుకు దొందే...డాక్టర్-పెషెంట్ తదితర కామెడీ స్కిట్స్ ప్రదర్శన ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నాయి. .ముందు...జాగ్రత్త స్కిట్స్ ప్రదర్శన నవ్వులు పూయించాయి. ఆయా స్కిట్స్‌లో జబర్దస్త్ ప్రకాష్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, పోర్టుశేషు, భానుప్రకాష్, శివజ్యోతి, పుష్యమి, ఈశ్వరరావు, సీత ప్రదర్శించిన తీరు అలరించింది.

ప్రమాదాల నియంత్రణపై సీపీ ఫోకస్

... 5వ పేజీ తరువాయి

దృష్టిసారించారు. తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ రూపొందించారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి బ్లాక్‌స్పాట్‌లుగా మార్కింగ్ చేయాలని ట్రాఫిక్ విభాగం అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నగరంలో 68 చోట్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించడంతో వాటిని బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరగడానికి గల కారణాలను గుర్తించి, సమస్యను పరిష్కరించాలని సీపీ ఆదేశించారు. బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన చోట ట్రాకోల్ట్, రోడ్‌సేఫ్టీ, హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ చేయడంతోపాటు, ప్రమాదకరంగా వాహనాలను నడిపేవారిని గుర్తించి కేసులు నమోదుచేయాలని ఆదేశించారు. బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించిన చోట రోడ్ల డిజైన్ సరిగా లేకపోయినా, జంక్షన్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంటే జీవీఎంసీ అధికారుల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. షీలానగర్ జంక్షన్ నుంచి గాజువాక వరకు ఏడు చోట్ల తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనాలను భద్రంగా నడిపేలా డ్రైవర్లకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే బ్లాక్‌స్పాట్‌ల వద్ద రబ్బరు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటుచేయడం, రాత్రిపూట డ్రైవర్లకు రోడ్డు మార్జిన్ స్పష్టంగా కనిపించేలా రేడియం రిఫ్లెక్టెడ్ స్టడ్స్ ఏర్పాటుచేయడం, డ్రైవర్లను అప్రమత్తంచేయడంతోపాటు అవగాహన కల్పించేలా బోర్డులను ఏర్పాటుచేయాలని సీపీ ఆదేశించారు. బ్లాక్‌స్పాట్‌లవద్ద లైటింగ్ సదుపాయం, చెట్లు, పొదలు అడ్డంగా ఉంటే వాటిని జీవీఎంసీ సహకారంతో ట్రిమ్మింగ్ చేస్తున్నారు.

ట్రాఫిక్‌సిగ్నల్స్‌కు ఏఐతో అనుసంధానం

నగరంలో చాలామంది వాహనచోదకులు తరచూ ట్రాఫిక్ సిగ్నల్ జంపింగ్‌కు పాల్పడుతూ ప్రమాదాలకు గురవడం, లేదా ప్రమాద కారకులుగా మారుతున్నారు. దీంతో ట్రాఫిక్‌సిగ్నల్స్‌కు ఏఐ టెక్నాలజీని అనుసంధానం చేయాలని సీపీ నిర్ణయించారు. ముందుగా నగరంలోని 110 కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏఐతో అనుసంధానించేందుకు జీవీఎంసీ టెండర్లు పిలిచింది. ఇది పూర్తయితే హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా, ట్రిపుల్‌రైడింగ్ చేసినా, సిగ్నల్ జంపింగ్ చేసినా, అపరిమితవేగంతో వాహనం నడిపినా ఆటోమెటిక్‌గా జరిమానా చాలానా జారీ అయిపోతుంది. దీనివల్ల ట్రాఫిక్ సిగ్నల్స్ జంపింగ్‌లకు శతశాతం అడ్డుకట్టపడి, రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని సీపీ భావిస్తున్నారు. దీంతోపాటు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు, ఆటోడ్రైవర్లు, భారీవాహనాల డ్రైవర్లకు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీ నిర్ణయించారు. ఇవన్నీ చేస్తూ వాహనాల వేగాన్ని నియంత్రించేలా నగరశివారు ప్రాంతాల్లో లేజర్‌స్పీడ్ గన్ వాహనాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు, నో హెల్మెట్ డ్రైవ్‌ను నిరంతరం కొనసాగించడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సీపీ భావిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలకు మంగళం?

... 5వ పేజీ తరువాయి

మూత, ఉన్న విద్యార్థులను మోడల్ ప్రాథమిక పాఠశాలకు తరలించడం వల్ల 40 మందికిపైగా సెకండరీ గ్రేడ్ టీచర్లు మిగులుతారు.

యూపీ పాఠశాలలకు మంగళం?

జిల్లాలో 29 ప్రాథమికోన్నత పాఠశాలలుండగా వీటిని ఏడింటిని ఉన్నత పాఠశాలలుగా ఇప్పటికే అప్‌గ్రేడ్ చేశారు. మరో నాలుగింటిని హైస్కూల్ స్థాయికి పెంచాలని ప్రతిపాదించారు. కాగా ఆరుచోట్ల యూపీ పాఠశాలలు మూతపడనున్నాయి. మిగిలిన 12 పాఠశాలలను యథావిధిగా కొనసాగించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇదిలావుండగా ఉన్నత పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను వెనక్కి తీసుకువచ్చి, పంచాయతీల్లో ఏర్పాటుచేసే మోడల్ పాఠశాలలకు పంపిస్తారు. ఈ తరగతులు వెనక్కి తేవడం, యూపీ పాఠశాలల రద్దు వంటి కారణాలతో జిల్లాలో సుమారు 100 స్కూలు అసిస్టెంట్ పోస్టులు మిలిపోయే అవకాశం ఉంది. గ్రామాల్లోని పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతుల్లో తక్కువ విద్యార్థులుంటే వారిని సమీప పాఠశాలకు తరలిస్తారు. ఈ క్రమంలో వారికి రవాణా చార్జీలు ఇస్తారని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతులకు ఉన్నత పాఠశాలలకు తరలించడంతో సర్కార్ పాఠశాలలకు మంగళం పాడే ప్రక్రియ ప్రారంభమయింది. దీంతో అధికశాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పది, అంతకంటే తక్కువకు పడిపోయింది. కాగా జిల్లా విద్యాశాఖ తాజాగా చేపట్టిన ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించి, ఆమోదించిన తరువాత ప్రభుత్వానికి పంపుతారు.

సచివాలయాల హేతుబద్ధీకరణ

... 5వ పేజీ తరువాయి

మంజూరయ్యాయి. ప్రస్తుతం 5,170 మంది పనిచేస్తుండగా 453 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రామీణ సచివాలయాల్లో 966 పోస్టులు మంజూరుచేయగా 870 మంది, జీవీఎంసీలో 4,657 పోస్టులకుగాను 4,300 మంది పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో 60, నగరంలో 393 పోస్టులు ఖాళీ ఉన్నాయి. 400 మంది వివిధ కారణాలతో సెలవులో ఉన్నారు. హేతుబద్ధీకరణ చేసే క్రమంలో 2,500 కంటే తక్కువ జనాభా ఉన్న సచివాలయాల్లో ఆరుగురు, 2,500 నుంచి 3,500 మధ్య ఉన్న సచివాలయాల్లో ఏడుగురు, 3,500 మంది కంటే ఎక్కువ ఉన్న సచివాలయాల్లో ఎనిమిది మంది సిబ్బంది ఉంటారు. ఈ మేరకు మండలాల వారీగా కసరత్తు జరుగుతోంది. జీవీఎంసీ పరిధిలో సుమారు 25 లక్షల జనాభాకు 551 సచివాలయాలు ఏర్పాటుచేశారు. సగటున ఒక సచివాలయం పరిధిలో నాలుగువేల కంటే ఎక్కువ జనాభా ఉన్నారని అధికారులు చెబుతున్నారు. మూడు కేటగిరీలుగా విభజించి సిబ్బందిని హేతుబద్ధీకరించాలని నిర్ణయించారు. ప్రస్తుతం జిల్లాలో మెజారిటీ సచివాలయాల్లో ఎనిమిది మందికి మించి సిబ్బంది లేరని, 453 ఖాళీలు ఉండడంతో సరిపోతారని భావిస్తున్నారు. హేతుబద్ధీకరణ తరువాత పంచాయతీ కార్యదర్శి/వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులను గ్రామ/వార్డు హెడ్‌గా పిలుస్తారు. పర్యవేక్షణకు మండల, జిల్లాస్థాయిలో వేర్వేరుగా కార్యాలయాలు ఏర్పాటుచేసి సిబ్బందిని నియమిస్తారు.

విమ్స్‌కు అధునాతన వైద్య పరికరాలు

... 5వ పేజీ తరువాయి

అందించేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా అల్సర్ల నిర్ధారణ, గ్యాస్ట్రిక్, పేగులు వరుపు వంటి సమస్యల నిర్ధారణకు ఎండోస్కోపీ, పెద్దపేగు సమస్యలను గుర్తించడానికి, పేగు కేన్సర్లు, ఫిస్టులాతోపాటు మరిన్ని సమస్యలను నిర్ధారించేందుకు కొలనోస్కోపీ చేస్తారు. అలాగే పాంక్రియాస్ కేన్సర్, స్టోన్స్, గాల్ బ్లాడర్ స్టోన్స్, పచ్చకామెర్లు నిర్ధారణకు ఎండోస్కోపిక్ రిట్రోగ్రేడ్ కొలాంజియో పాంక్రియాటోగ్రఫీ (ఈఆర్‌సీపీ) పరీక్ష చేస్తారు. సూక్ష్మ కణితుల నిర్ధారణ, కొన్నిరకాల కేన్సర్ కారకాల నిర్ధారణకు ఎండోస్కోపిక్ అల్ట్రా సోనోగ్రఫీ పరీక్ష నిర్వహిస్తారు. వీటితోపాటు మరిన్ని రకాల వ్యాధుల నిర్ధారణకు సిగ్మాయిడోస్కోపీ, సైడ్ వ్యూ ఎండోస్కోపీ పరీక్షలు చేస్తారు. ఈ పరికరాల సహాయంతో ఇప్పటివరకూ 864 మందికి ఎండోస్కోపీ, 45 మందికి ఈయూఎస్, 546 మందికి కొలనోస్కోపీ, సిగ్మాయిడో స్కోపీ 546 మందికి, 63 మందికి ఈఆర్‌సీపీ పరీక్ష నిర్వహించారు.

మెరుగైన సేవందించేందుకు దోహదం



ప్రభుత్వం అందించిన అడ్వాన్స్‌డ్ పరికరాల సహాయంతో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించగలుగుతున్నాం. జీర్ణకోశం, అన్నవాహిక, కడుపులో అల్సర్లు, కేన్సర్లను గుర్తించడంలో ఈ పరికరాలు కీలకంగా వహిస్తున్నాయి. పెద్దపేగు కేన్సర్లు, ట్యూమర్లను గుర్తిస్తున్నాం. ప్రతిరోజూ ఆయా పరికరాల సహాయంతో ఐదుగురికి అయినా పరీక్షలు చేస్తున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సమాచారం ఉంది.

- డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్



మోదీ, నిర్మలా సీతారామన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బీఎంఎస్ నాయకులు

ప్రధాని, ఆర్థిక మంత్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం

పెదగంట్యాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు ప్రధాని మోదీ ఫెక్సీకి స్టీల్ ప్లాంట్ బీఎంఎస్ నాయకులు ఆదివారం పెదగంట్యాడ జంక్షన్‌లో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు ట్యాక్స్ ఫ్రీ చేయడం వల్ల మధ్యతరగతి కుటుంబాలకు ఊరట లభిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంటుకు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడంతో కర్మాగారానికి ఊపిరి పోసినట్టయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరావు, గురుప్రసాద్, గురప్పరెడ్డి, ఎరుకునాయుడు, మోహన్‌రావు పట్నాయిక్, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహ ప్రతిష్ట

పెదగంట్యాడ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వవార్డు పరిధి నడుపూరులోని సంకట విమోచన గణపతి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మహామృత్యుంజయేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలాగే ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీ గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, భూపతిరాజు సుజాత, ఉరుకూటి చందు, పల్లా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి

పూసపాటిరేగ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా పూసపాటిరేగలోని కనిమెట్ట జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయిని బి.సౌజన్య దుర్మరణం చెందారు. మృతురాలు భోగాపురంలోని పోలిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. విశాఖలో నివాసం ఉంటున్న సౌజన్య, భర్త కింగువ రవికుమార్, ఇద్దరు పిల్లలు, అత్త భవానీతో కుంభమేళాకు కారులో వెళ్లి తిరిగి వస్తూ ఆదివారం తెల్లవారుజామున కనిమెట్ట వద్ద లారీని వెనక నుంచి ఢీకొన్నారు. తలకు తీవ్ర గాయమ వ్వడంతో అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్, భవానీలకు గాయాలయ్యాయి. ఎస్ఐ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.



సౌజన్య (ఫైల్)

సినిమా గైడ్

● **మదగజరాజా :** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
● **మహిష :** రమాదేవి
● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, మోహిని కాంప్లెక్స్ శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 29, టమాటా 12, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజీ 12, క్యారెట్ 24, దొండకాయలు 36, బంగాళదుంపలు 16, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 44, మునక్కాడలు (కిలో) 100, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 24, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీరదోస 32, క్యాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 56, దేముడుచిక్కుడు 24, గోరుచిక్కుడు 26, ఆగాకార దేశవాళి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూరపెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడికాయ 30, మామిడికాయలు 120, కర్రపెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	490
విజయనగరం	494
శ్రీకాకుళం	494

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ముగిసిన ఆర్థో సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు

» ఆర్థో సర్జన్ల సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ అశోక్‌కుమార్ ఎంపిక



డాక్టర్ అశోక్ కుమార్‌తో వైద్యులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరుగుతున్న ఏపీ ఆర్థో సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు ఆదివారంతో ముగిసింది. నాలుగో రోజు సదస్సులో వివిధ అంశాలపై వైద్యులు చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆర్థో వైద్యుడు డాక్టర్ గురువారెడ్డి మాట్లాడుతూ కీళ్ల మార్పిడి, వాటి అరుగుదల, నూతన వైద్య విధానాలు, శస్త్ర చికిత్సలపై గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కలి గించాలన్నారు. కీళ్ల మార్పిడికి సంబంధించి ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే ఇబ్బందులు లేకుండా జీవనం సాగిం చవచ్చన్నారు. మరో ఆర్థో వైద్య నిపుణుడు డాక్టర్ కృష్ణ కిరణ్ మాట్లాడుతూ జాయింట్ రీ ప్లేస్‌మెంట్, హిప్ రీ ప్లేస్‌మెంట్ విభాగాలపై కూడా వైద్యులు, వైద్య విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం సభ్యులు ఆర్థోపెడిక్ సర్జన్ల సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యక్షుడిగా సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. అశోక్ కుమార్‌ను ఎన్నుకున్నారు. వచ్చే ఏడాది రాష్ట్రస్థాయి సదస్సును కర్నూలులో నిర్వహిం చాలని నిర్ణ యించారు. నాలుగు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో ఆరు లైవ్ సర్జరీలు, ఐదు వర్క్‌షాప్‌లు నిర్వహించగా, 150 మంది వైద్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ శివానందతో పాటు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎల్ఎస్ లోకనాథ్, వైద్యులు వర్మ, వీవీకే, రమేశ్ సేన్, విజయ్, అచ్యుత్ పాల్గొన్నారు.



గాజువాక పరసలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

వైభవంగా గాజువాక పరస

సీతారామ ఉమారామలింగేశ్వర స్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

గాజువాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రాంతంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన సీతారామ ఉమారామలింగేశ్వర స్వామి పరసను ఆదివారం ఎంతో వైభవంగా నిర్వహించారు. గాజువాక బీసీ రోడ్డు ప్రాంతంలో ఉన్న ఆలయానికి ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. గాజువాకతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వందలాది భక్తులు పరసకు తరలిరావడంతో ఇక్కడ సందడి వాతావరణం నెలకొంది. సాయంత్రం భారీ ఎత్తున ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నాతయ్యపాలెంలో బంగారుమాంబ..

అక్కిరెడ్డిపాలెం: నాతయ్యపాలెం, షీలానగర్ పరిసర కాలనీల ఆరాధ్య దేవత బంగారుమాంబ పరసను ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని అమ్మవారికి పసుపు కుంకుమలతో పాటు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన తప్పెటగుళ్ళు, కోలాటాలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, అదీప్‌రాజ్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు జి.శ్రీనివాసరావు, జి.వెంకటరమణ, పి.శ్రీనివాసరావు, పి.ప్రకాశరావు, శ్రీను, వెంకటరమణ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గంజిపేటలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి గంజిపేటలో గల అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించి అర్చకులు పూజలు ప్రారంభించారు. కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, ఇల్లపు వరలక్ష్మీతో పాటు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జరిగిన తీర్థంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



టీపీ గురుతుగా గ్రూప్ ఫొటో దిగిన శ్రీహరిపురం వీటీ కాలేజీ విద్యార్థులు



గాజువాక హైస్కూల్ విద్యార్థులు..

ఉల్లాసంగా.. ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

గాజువాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతానికి చెందిన రెండు పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం గాజువాకలో ఆత్మీయ కలయిక పేరిట వేర్వేరుగా కార్యక్రమాలను ఏర్పాటు చేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఇందులో భాగంగా శ్రీహరిపురం వీటీ కళాశాలకు చెందిన పదో తరగతి 1990వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు గాజువాకలోని హోటల్ రామచంద్రాలో కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అనిల్, కోమల, రాజీ, సుధ, శ్రీదేవి, ప్రమీల, సతీశ్, రవి బాను, రాంబాబు, ఇందుమతి, మీనాదత్తా, రమణమ్మ, వంశీ, రామారావు, కుమారస్వామి, సీతా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే గాజువాక హైస్కూల్ 1990-91 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు పాఠశాలలోనే కలుసుకుని ఒకరికొకరు యోగ క్షేమాలు, పిల్లల చదువులు, పెళ్లిళ్ల తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. నాడు విద్యార్థులుగా తరగతి గదిలో చేసిన అల్లర్లను జ్ఞాపకం చేసుకుని ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా సమష్టిగా ఓ బ్యాంకు ఖాతా తెరిచి ప్రతినెలా ఎవరికి అవకాశం ఉంటే తోచినంత నగదును డిపాజిట్ చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కరణంరెడ్డి నరసింగరావు, చట్టి గోపి, నర్సింగ్, బాలకుమార్, మోహన్, లక్ష్మి, పార్వతి, శైలజ, తదితరులు పాల్గొన్నారు. టీపీ గురుతుగా గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు.

యువకుడి మృతిపై పలు అనుమానాలు

కీలకంగా మారనున్న పోస్టుమార్టం నివేదిక!

గాజువాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గాజువాక సమీపంలోని శ్రీనగర్‌లో ఉరి వేసుకుని భాస్కరరావు అనే యువకుడు మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తుంది. భాస్కరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. ఆ యువకుడి తలపై బలంగా పిడుగుద్దులు గుద్దడం వల్ల తల భాగం మొత్తం ఉబ్బిపోవడం, నరాలు దెబ్బతిని రక్తప్రసరణ ఆగిపోయి మృతి చెంది ఉండవచ్చని వైద్యులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. శ్రీనగర్‌లో శుక్రవారం మృతి చెందిన భాస్కరరావు తమ పక్కింట్లోని యువతి స్నానం చేస్తుండగా సెల్ ఫోన్‌లో వీడియో తీశాడన్న అభియోగం నేపథ్యంలో యువతి కుటుంబ సభ్యులు యువకుడిని దారుణంగా కొట్టి గదిలో బంధించినట్టు భోగట్టా. ఈ సమాచారాన్ని శనివారం యువతి కుటుంబ సభ్యులు విజయనగరంలో ఉంటున్న భాస్కరరావు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఇక్కడకు వచ్చారు. దీంతో భాస్కరరావు ఉంటున్న ఇంటి తాళాన్ని యువతి కుటుంబ సభ్యులు తీశారు. అయితే అప్పటికే భాస్కరరావు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నట్టు గుర్తించారు. కాగా తొమ్మిది మంది వరకు భాస్కరరావుపై దాడి చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నా ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా నిందితులపై పోలీసులు చర్యలు చేపట్టనున్నారు. బలంగా కొట్టి తమ కుమారుడిని చంపేసి ఉరి వేసుకున్నట్టు యువతి కుటుంబ సభ్యులు చిత్రీకరిస్తున్నారని భాస్కరరావు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు

అగనంపూడి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస బాలవికాస్ కేంద్రంలో స్థానిక సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం వసంతపంచమి వేడుకలను ఘనంగా నిర్వంచారు. ఈ సందర్భంగా సర్వసతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం భజన, భక్తి గీతాలను అలపించారు. భజన మండలి ప్రతినిధులు సాయి సరస్వతి, విందుల వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నాతయ్యపాలెం వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆదివారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన పెద్దింటి లక్ష్మీనారాయణ (55) నాతయ్యపాలెంలో గత 20 ఏళ్లుగా టైలరింగ్ చేసుకుంటూ కుటుంబంతో ఉంటున్నారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో అక్కిరెడ్డిపాలెం నుంచి నాతయ్యపాలెంలోని తన ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తి స్కూటీతో బలంగా ఢీకొని వెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణను స్థానికులు చికిత్స నిమిత్తం కేజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతు ఆయన ఆదివారం మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి శారదాపీఠం వార్షికోత్సవాలు

పెందుర్తి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలోని శారదాపీఠం వార్షికోత్సవాలు సోమవారం నుంచి ఏడో తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులతో ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వీయ పర్యవేక్షణలో ఐదు రోజులు జరగనున్న వేడుకల సందర్భంగా హైందవ ధర్మం విశిష్టతను తెలియపరిచే విధంగా ఆధ్యాత్మిక, ధార్మిక సమ్మేళనం కలబోతగా ఉండబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం వేడుకల వివరాలను తెలిపారు. లోక కల్యాణం, దేశ రక్షణ కోసం పీఠంలో హోమాలు, పూజలు, వ్రతాలు, రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ప్రయోగరాజ్ కుంభమేళా త్రివేణి సంగమం పవిత్ర జలాలతో పీఠం అధిష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తారు. వసంత పంచమి సామూహిక అక్షరాభ్యాసాలు, రాజశ్యామల యాగం చేపట్టనున్నారు. పీఠం ప్రాంగణంలో దేవతామూర్తులు శారదామాత, దాసాంజనేయస్వామి, మేధో దక్షిణామూర్తి, శ్రీవల్లి సుబ్రహ్మణ్యస్వాములకు పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు.

ఏకగ్రీవంగా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

పెందుర్తి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పరిధిలోని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమీటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. చినముషిడివాడలోని పోర్టు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన గిరిజన సంఘ ప్రత్యేక సమావేశంలో నూతన పాలక వర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్షులుగా లకే చిట్టిబాబు, గౌరవ అధ్యక్షులుగా గుజ్జెల దేవరాజు, ముఖ్య సలహాదారుగా శతక చిట్టయ్య, తాంగుల రంగారావు, న్యాయసలహాదారుగా అంబిడి రాజయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులుగా అడపా తిరుపతి వేంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా దాసరి భాస్కరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా రొబ్బ వెంకటరావు, కోశాధికారిగా శెట్టి జయదాస్, మరో 35 మంది పాలకవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ ఎన్నిక రాష్ట్ర గిరిజన ఐక్య వేదిక అధ్యక్షుడు కొక్కుల రామారావు ఆధ్వర్యంలో జరిగింది. సంఘ నూతన అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల కుటుంబాల సమస్యల పరిష్కారానికి సంఘం నిర్విరామంగా కృషి చేస్తుందన్నారు.

అప్పారావుకు తెలుగు వెలుగు మహానంది అవార్డు

అగనంపూడి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి దానబోయినపాలేనికి చెందిన విందుల జాజుల అప్పారావుకు తెలుగు వెలుగు నంది అవార్డును ప్రదానం చేశారు. ఈ మేరకు ఆదివారం తెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ అవార్డుతో పాటు సకలకళా కోవిదుడు బిరుదును అందజేశారు. ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తూ, భజన, బుర్రకథ, జానపద, కళారంగంలో విశిష్ట సేవలందిస్తున్న అప్పారావును గుర్తించి అవార్డును అందజేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అవార్డు అందుకుంటున్న విందుల జాజుల అప్పారావు

ఘనంగా మరిడిమాంబ పరస



అన్నసమారాధన చేస్తున్న గండి బాబ్జీ తదితరులు

పెందుర్తి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 95వ వార్డు పరిధి పురుషోత్తపురం పరిసర గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ పరస ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారికి పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పెందుర్తి ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముమ్మన దేవుడు, బల్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచి పిల్లల అప్పలనాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రాంపురం శివాలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు



నూతన ధ్వజస్తంభం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, గ్రామస్తులు

పెందుర్తి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాంపురం సాధుమఠం ప్రాంగణంలో గల శివాలయంలో స్థానికుడు అనుపోజు రాజు సమకూర్చిన రూ.3.2 లక్షలతో ఏర్పాటుచేసిన నూతన ధ్వజస్తంభం ఆదివారం ప్రారంభించారు. రుత్వికులు శాస్త్రోక్తంగా ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, మాజీ ఎంపీపీ రెడ్డి వరలక్ష్మి, నిర్వాహకుడు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణ ఉత్సవం

స్థానిక వెంకటాద్రి శిఖరంపై వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాస నిత్య కల్యాణ ఉత్సవం ఆదివారం నిర్వహించారు, రుత్వికులు వేదమంత్రాలతో స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఎస్ఆర్‌పురంలోని దుర్గాదేవి ఆలయంలో ఆదివారం మాఘశుద్ధ పంచమి సందర్భంగా దుర్గాదేవికి సరస్వతిగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు కాయితి ఎర్రిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మామపై అల్లుడు దాడి

పెందుర్తి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో జరిగిన వేడుకకు తనను ఆహ్వానించలేదన్న ఆగ్రహంతో మామపై అల్లుడు దాడికి పాల్పడిన ఘటన వేపగుంట సమీపంలోని అప్పన్నపాలెంలో చోటుచేసుకుంది. సీఐ కెవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా తుమ్మపాలకు చెందిన నక్క శ్రీనివాసరావు(33)కు, అప్పన్నపాలెంకు చెందిన దేవాడపు జోగారావు (50) కుమార్తెతో వివాహమైంది. కొంతకాలంగా మామ, అల్లుడు మధ్య కుటుంబపరమైన వివాదాలునాయి. ఈ క్రమంలో శనివారం మామయ్య కుటుంబంలో జరిగిన వేడుకకు శ్రీనివాసరావును ఆహ్వానించలేదు. దీంతో ఆదే రోజు రాత్రి మామయ్య జోగారావును శ్రీనివాసరావు నిలదీసి తగువు పెట్టాడు. అప్పటికే మద్యం తాగిన మైకంలో ఉన్న అల్లుడు కత్తితో మామను గాయపరిచాడు. అతను గాయపడడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ సంఘటన స్థలానికి వెళ్లినిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

అదృశ్యమైన పిల్లలు తల్లిదండ్రులకు అప్పగింత

పెందుర్తి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు పిల్లల అదృశ్యం ఉదంతం సుఖాంతమయ్యింది, వేపగుంట ముత్యమాంబ కాలనీలో రెండు కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలికలు (10, 9 సంవత్సరాల వయస్సు), ఓ బాలుడు (9) శనివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుని అదృశ్యమయ్యారు. తల్లిదండ్రులు వీరి ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కెవీ సతీశ్ కుమార్ వెంటనే ప్రత్యేక పోలీసు బృందాలతో గాలించగా, వీరు ముగ్గురూ పార్వతీపురం మన్యం జిల్లా శంబరలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడ వీరి బంధువులు ఉండటంతో శంబర పోలమాంబ ఉత్సవాలు చూసేందుకు బస్సులో ముగ్గురూ వెళ్లారని సీఐ చెప్పారు. శంబరకు పోలీసులను పంపి పిల్లలను తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

షిప్‌యార్డులో ఉద్యోగుల సంబరం

మల్కాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో షిప్‌యార్డుకు రూ.150 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించడంతో అందరిలో ఒక్కసారిగా ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రతిసారీ మౌలిక సదుపాయాల కోసం రెండు నుంచి పది కోట్ల రూపాయల వరకు ప్రకటించేది. ఈ డబ్బులు దేనికీ సరిపోయేవి కాదు. గత ఏడాది బడ్జెట్‌లో రూ.10 కోట్లు ఇచ్చిన కేంద్రప్రభుత్వం ఇప్పుడు ఏకంగా రూ.150 కోట్లు కేటాయింపులు చేయడంతో సంబరపడుతున్నారు. సంస్థకు ప్రస్తుతం రూ.15 వేల కోట్ల నౌకా నిర్మాణ ఆర్డర్లు ఉన్నప్పటికీ, ఆ పనులు సకాలంలో పూర్తిచేసేందుకు తగ్గ మౌలిక సదుపాయాలు కల్పించుకోవాల్సిన తరుణంలో ఈ కేటాయింపులు ఊరట కలిగిస్తున్నాయని షిప్‌యార్డు మాజీ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం షిప్‌యార్డులో ఉన్న భారీ క్రేన్‌లు, యంత్రాల నిర్వహణకు ఈ నిధులను వినియోగిస్తారు. రక్షణ రంగంలో షిప్‌యార్డు విలీనం కాకముందు దీని భవితవ్యం ప్రశ్నార్థకంగా ఉండేది. తరువాత కూడా చాలీచాలనీ ఆర్డర్లతో సతమతమవుతున్న సమయంలో కేంద్రం రక్షణ రంగానికి రూ.15 వేల కోట్ల భారీ ఆర్డర్‌ను ప్రకటించింది. ఓ వైపు సంతోషంగా అనిపించినా, ఈ పనులు చేయడానికి యంత్ర పరికరాలు సరిగా లేవన్న మీమాంసలో ఉన్న తరుణంలో బడ్జెట్ కేటాయింపులు అనూహ్యంగా పెంచడంతో సంస్థ ఉద్యోగుల్లో ఒక్కసారిగా జోష్ పెరిగింది. కేటాయింపుల్లో కోత పెట్టకుండా ఉంటారా? అన్న శంక కూడా కొందరిలో ఉంది.

జోరుగా కర్బూజా విక్రయం

గోపాలపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎండలు కాస్త పెరగడంతో శీతల పానీయాలు, కర్బూజ విక్రయాలు ప్రారంభమయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పటికీ పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు శీతల పానీయాల వైపు చూస్తున్నారు. కర్బూజా ఫలాలను కొనుగోలు చేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి ఇవి పెద్ద మొత్తంలో దిగుమతి అవుతున్నట్లు వర్తకులు చెబుతున్నారు. మరో రెండువారాల్లో వీటి విక్రయాలు మరింత జోరందుకుంటాయని వర్తకులు చెబుతున్నారు.

'పేద విద్యార్థులకు తోడ్పాటు అందిస్తాం'



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవికుమార్. చిత్రంలో తహసీల్దార్ సింహగిరి, తదితరులు ఉన్నారు

సింధియా, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అన్ని విధాలుగా తమ సంక్షేమ సంఘం సహకరిస్తుందని రాష్ట్ర రెల్లి కుల అభివృద్ధి సంఘం అధ్యక్షుడు కొట్నాల రవి అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు పరిధి జైఆంధ్రకాలనీలోని కమ్యూనిటీ భవనంలో ఆదివారం విద్యా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాడేరు తహసీల్దార్ కోన సింహగిరి పాల్గొన్నారు. రెల్లి కుల యువతీ, యువకులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. సుమారు 300 మంది విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కోన ప్రసన్నకుమార్, పిన్నింటి జనార్ధన్, కెల్లా మురళి, అప్పారావు, వారబాబు, మరియాదాసు పాల్గొన్నారు.